PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 135 | విజయవాడ, శుక్రవారం 16 డిసెంబర్ 2022 | 6 + 8 పేజీలు వెల : 5. 50

Vol No | Vijayawada, Friday 16 December 2022 | Rs

2023లో

23 సాధారణ సెలవులు

- 22 ఐచ్ఛిక సెలవులు
- మేడే విస్మరణ
- ఉత్తర్వులు జారీ

లోపలి పేజీలో...



ఫైనల్లోకి ఫ్రాన్స్

- సెమీస్‌లో మొరాకోపై 2-0గోల్స్‌తో గెలుపు
- 18న టైటిల్‌కై అర్జెంటీనాతో ఢీ

లోపలి పేజీలో...



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి

మహిళా శిశుసంక్షేమశాఖలో సిడిపిఓ పోస్టుల భర్తీ

సమీక్షలో సిఎం జగన్మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న శిశు అభివృద్ధి కార్యక్రమ అధికారి (సిడిపిఒ) పోస్టులను ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఎపిపిఎస్‌సి) ద్వారా భర్తీ చేయాలని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం ఉదయం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో మహిళా శిశు సంక్షేమ శాఖపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీల్లో ఖాళీగా ఉన్న సిడిపిఓ పోస్టుల వివరాలను అధికారులు సిఎంకు అందించారు. అనంతరం సిఎం మాట్లాడుతూ 61 సిడిపిఓ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని తెలిపారు. వాటితోపాటు ఖాళీగా ఉన్న పోస్టుల్లో సిబ్బందిని నియమంచాలని సూచించారు. అలాగే మౌలిక సదుపాయాలపైనా దృష్టి సారించాలని, నాడునేడు పనులను వేగవంతం చేయాలని తెలిపారు. పిల్లలకు మంచి పౌష్టికాహారం అందించాలన్నారు. సార్టెక్స్ రైస్ సరఫరా చేయాలని, న్యూట్రీషన్ కిట్ సరఫరాలో నాణ్యత విషయంలో రాజీపడొద్దని పేర్కొన్నారు. అన్నిట్లోనూ క్వాలిటీ పెరగాలని, గతంలో కన్నా పిల్లలకు మంచి చేస్తున్నామనే సంతృప్తి కలగాలని తెలిపారు. దీనికోసం అవసరమైన వసతులు, సదుపాయాలు పూర్తిగా కల్పించాలని పేర్కొన్నారు. అంగన్‌వాడీల్లో కరికులమ్ కూడా మారాలని, దీనికోసం ప్రత్యేక అధికారిని నియమించాలి తెలిపారు. చిన్న వయస్సులోనే మెదడు తొందరగా పరిణితి చెందుతుందని వివరించారు. కొత్తగా అందుబాటులోకి వచ్చిన సూపర్ వైజర్ల సాయంతో అంగన్‌వాడీ కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించాలని సిఎం పేర్కొన్నారు. తనిఖీలు, నాణ్యత, నాడు నేడులో ఖచ్చితమైన మార్పు కనిపించాలని సిఎం పేర్కొన్నారు. అగ్రికల్చర్, ఎడ్యుకేషన్, హెల్త్, హౌసింగ్, మహిళా శిశు సంక్షేమశాఖలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. అలాగే చేస్తున్న పనులకు ఖచ్చితమైన ఫలితాలు రావాలని, సూపర్‌వైజర్లు సక్రమంగా పనిచేయాలని, వారి పనితీరుపైనా పర్యవేక్షణ ఉండాలని సిఎం తెలిపారు. అక్కడ నుండే పిల్లలకు భాషపై గట్టి పునాది అందించాలని, ఉత్తమ అభ్యాసాలు ఉండాలని వివరించారు. ఈ సమీక్షలో మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి ఉషశ్రీచరణ్, సిఎస్ కె.ఎస్.జవహర్‌రెడ్డి, మహిళా శిశు సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి ముద్దాడ రవిచంద్ర, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కాటంనేని భాస్కర్, మహిళా శిశు సంక్షేమశాఖ డైరెక్టర్ డాక్టర్ ఎ.సిరి, పౌరసరఫరాల శాఖ ఎండి వీరపాండ్యన్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫస్టియర్ పరీక్ష ఫీజు షెడ్యూల్ విడుదల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థుల పరీక్షల ఫీజు షెడ్యూల్ ఇంటర్మీడియట్ బోర్డు విడుదల చేసింది. మార్చిలో జరగనున్న పరీక్షలకు జనవరి 7వ తేదీలోపు ఎలాంటి అపరాధ రుసుమూ లేకుండా ఫీజు చెల్లించవచ్చని బోర్డు కార్యదర్శి ఎంవి శేషగిరి బాబు తెలిపారు. రూ.120 అపరాధ రుసుముతో జనవరి 10వ తేదీ వరకు, రూ.500 రుసుముతో 12వ తేదీ వరకు, రూ.1000 రుసుముతో 17వ తేదీ వరకు, రూ.2 వేలతో 20వ తేదీ వరకు, రూ.3వేలతో 23 వరకు, రూ.5వేలతో 25వ తేదీ వరకు చెల్లించవచ్చని వివరించారు. పరీక్ష దరఖాస్తుకు రూ10, సాధారణ కోర్సులకు, రూ.510, వొకేషనల్ కోర్సు విద్యార్థులు రూ.720, వోకేషనల్ బ్రిడ్జి కోర్సు సబ్జెక్టులకు రూ.155 చెల్లించాలని తెలిపారు. మొదటి సంవత్సరం వోకేషనల్ బ్యాక్‌లాగ్ విద్యార్థుల ప్రాక్టికల్స్‌కు రూ.210, బ్రిడ్జి కోర్సు గణితానికి రూ.155 చెల్లించాలి.



బీమాలో కార్పొరేట్లు వద్దు

- డెయిరీ దిగుబడుల సరళీకరణ ఆపాలి
- ఏడు తీర్మానాలు ఆమోదించిన ఎఐకెఎస్ మహాసభ

లోపలి పేజీలో..!

సవరణ అవసరం లేదు

ఫిరాయింపుల చట్టంపై పార్లమెంటులో కేంద్రం

మళ్లీ తెరపైకి జమిలి ఎన్నికలు

ప్రజాశక్తి - న్యూఢిల్లీ బ్యూరో

పార్టీ ఫిరాయింపుల చట్టం బిజెపి చేతిలో ఎంతగా అపహాస్యానికి గురైందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. అనేక రాష్ట్రాల్లో ఎంఎల్‌ఏలను లొంగదీసుకుని, ప్రజలుఎన్నుకున్న ప్రభుత్వాలను కూల్చివేసి అధికారాన్ని చెలాయిస్తున్న ఘనత ఆ పార్టీది! ఈ నేపథ్యంలో పార్టీ ఫిరాయింపుల చట్టాన్ని మరింత బలోపేతం చేసి, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలన్న డిమాండ్ దేశ వ్యాప్తంగా వినిపిస్తోంది. అయితే, బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం మాత్రం ఫిరాయింపుల చట్టం బ్రహ్మాండంగా పనిచేస్తోందని, దానికి ఎటువంటి సవరణ అవసరం లేదని పార్లమెంటు సాక్షిగా ప్రకటించింది. అదే సమయంలో జమిలి ఎన్నికలను మరోసారి తెరపైకి తీసుకువచ్చింది. పార్లమెంటుకు, రాష్ట్రా శాసనసభలకు ఒకే సారి ఎన్నికలు జరపాలన్నది తమ విధానమని తెలిపింది. ఈ మేరకు కేంద్ర న్యాయ శాఖ మంత్రి కిరణ్ రిజిజు రాజ్యసభలో రెండు వేరువేరు ప్రకటనలు చేశారు. ఫిరాయింపులపై అడిగిన ఒక ప్రశ్నకు ఆయన జవాబిస్తూ దేశంలో ఫిరాయింపులు గణనీయంగా తగ్గాయని, అందువల్ల పార్టీ ఫిరాయింపుల చట్టానికి ఎలాంటి సవరణలు చేయాల్సిన అవసరం లేదని చెప్పారు. 1985లో 52వ రాజ్యాంగ సవరణ చేసి పార్టీ ఫిరాయింపుల చట్టాన్ని 10 షెడ్యూల్‌లో చేర్చారని తెలిపారు. అప్పటి నుండి ఈ చట్టం అద్భుతంగా పనిచేస్తోందని అన్నారు. ఫలితంగా దేశ వ్యాప్తంగా పార్టీ ఫిరాయింపుల కేసులు గణనీయంగా తగ్గాయని అన్నారు. పైగా పదో షెడ్యూల్‌లోని నిబంధనలు కాలపరీక్షకు నిలిచాయని, న్యాయపరమైన పరిశీలనలను సమీక్షలను అధిగమించాయని ఆయన చెప్పారు. వీటన్నింటిని పరిగణలోకి తీసుకుని ఫిరాయింపుల చట్టానికి ఇప్పటికిప్పుడు ఎటువంటి సవరణ చేయాల్సిన అవసరం లేదని తమ ప్రభుత్వం భావిస్తోందని చెప్పారు. ఒకవైపు ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వాలను కూలుస్తూ, మరోవైపు ఫిరాయింపుల చట్టం బాగా పనిచేస్తోందంటూ మంత్రి చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. మరో ప్రశ్నకు ఇచ్చిన రాతపూర్వక జవాబులో లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీలకు ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించడం వల్ల ఖజానాకు భారీగా ఆదా అవుతుందని తెలిపారు. ఎన్నికలు ఖరీదైన వ్యవహారంగా మారాయని అన్నారు. ఎన్నికల చట్టాలలో సంస్కరణలపై లా కమిషన్ తన 170వ నివేదికలో పాలనలో స్థిరత్వం కోసం లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీలకు ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించాలని సూచించిందని తెలిపారు. దీనివల్ల ప్రభుత్వ ఖజానాకు భారీగా ఆదా అవుతుందని, రాజకీయ పార్టీలు, అభ్యర్థులకు ఎన్నికల ప్రచారంలో గణనీయమైన పొదుపు అవుతుందని చెప్పారు. విడిగా జరుపుతన్న ఎన్నికల కారణంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని సుదీర్ఘంగా అమలు చేయాల్సివస్తోందని, ఫలితంగా అభివృద్ధి కార్యక్రమాలపై ప్రతికూల ప్రభావం పడుతోందని చెప్పారు. 1951-52, 1957, 1962, 1967లో లోక్‌సభకు, అన్ని రాష్ట్రాల శాసనసభలకు ఒకేసారి ఎన్నికలు జరిగాయని, అయితే, 1968, 1969లో కొన్ని శాసనసభలను ముందస్తుగా రద్దు చేయడం వల్ల ఈ చక్రానికి అంతరాయం కలిగిందని తెలిపారు.



రాజ్యసభలో మాట్లాడుతున్న కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరణ్ రిజిజు

ఆర్‌టిసి విధ్వంసానికి కుట్ర..!

- దేశవ్యాప్త ఐక్య ఉద్యమాల నిర్మాణం
- ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర మహాసభలో లక్ష్మయ్య



మహాసభలో మాట్లాడుతున్న ఆర్.లక్ష్మయ్య

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

ఆర్‌టిసిని విధ్వంసం చేయడానికి రాష్ట్రంలో పెద్ద ఎత్తున కుట్ర జరుగుతోందని, దీనిని కార్మికులు తిప్పికొట్టాలని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య అన్నారు. రెండ్రోజులపాటు జరగనున్న ఎస్‌డబ్ల్యుఎఫ్ 12వ రాష్ట్ర మహాసభ నెల్లూరులోని డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో గురువారం ప్రారంభమైంది. తొలుత సంఘం జెండాను ఎస్‌డబ్ల్యుఎఫ్ మాజీ డిప్యూటీ జనరల్ జి. దశరథరామయ్య ఆవిష్కరించారు. మహాసభకు నాయకులు సీతాలక్ష్మీ, పరుశురామ్, హరిప్రసాద్, జిలాని బాషా అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా లక్ష్మయ్య మాట్లాడుతూ.. దేశంలో రవాణా రంగం సంక్షోభంలో ఉందన్నారు. మధ్యప్రదేశ్ ఆర్‌టిసి కనుమరుగు అయ్యి 20 సంవత్సరాలు దాటుతోందని, ఆ జాబితాలో అనేక ఆర్‌టిసిలు ఉన్నాయన్నారు. పెట్రోలు, డీజిలు ధరల పెరుగుదలే ఈ సంక్షోభానికి కారణమని తెలిపారు. తొలిసారి మోడీ అధికారంలోకి వచ్చినప్పుడు లీటర్ డీజిల్ ధర రూ.57 ఉండేదని, ప్రస్తుతం రూ.100 ఉందన్నారు. 2014లో అంతర్జాతీయంగా ముడిసరుకు బ్యారేన్ ధర రూ.110 డాలర్లు ఉండగా ప్రసుత్తం 83 డాలర్లకు తగ్గిందని, అంతర్జాతీయంగా ముడిసరుకు ధర తగ్గుతున్నా..మనదేశంలో మాత్రం డీజిల్ ధరలు పెరుగుతున్నాయని తెలిపారు. మూడు కీలకమైన సమస్యలపై నివేదికలు తయారు చేస్తున్నామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వానికి ప్రత్యామ్నాయాలు చూపించి, జనవరి లేదా ఫిబ్రవరి లేదా మార్చిలో దేశవ్యాప్తంగా ఐక్య ఉద్యమాలు నిర్మించడానికి సిద్ధమవుతున్నామన్నారు. ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ.. ప్రతిపక్ష నేతగా జగన్ పాదయాత్ర చేసినప్పుడు పిఆర్‌సితో పాటు ఆర్‌టిసి కార్మికులు సమస్యలపై అనేక హామీలిచ్చారని, సిఎం అయ్యాక

మిగతా 2 లో

'జాతీయ పెన్షన్' జమ రూ.5.5 లక్షల కోట్ల పైమాటే !

రాష్ట్రాలకు తిరిగి చెల్లించలేమన్న పిఎఫ్‌ఆర్‌డిఎ

న్యూఢిల్లీ : తమ ఉద్యోగులు చెల్లించిన ఎన్‌పిఎస్ (జాతీయ పెన్షన్ వ్యవస్థ) కార్పస్ ఫండ్ మొత్తాన్ని తమకు తిరిగి ఇచ్చేయాలని పలు రాష్ట్రాలు డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో, కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ కేంద్రం, రాష్ట్రాల వారీగా చందాదారులు, వారి కంట్రిబ్యూషన్ల మొత్తాలు, ఎన్‌పిఎస్ కింద పోగైన ఆస్తుల (అసెట్స్ అండర్ మేనేజ్‌మెంట్-ఎయుఎం) వివరాలను వెల్లడించింది. ఆర్థిక మంత్రిత్వ శాఖ వెల్లడించిన డేటా ప్రకారం, 20లక్షల మందికి పైగా కేంద్ర ప్రభుత్వ ఎన్‌పిఎస్ చందాదారులు వున్నారు. 50లక్షలకు పైగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఈ పథకానికి తమ వాటాలను చెల్లించారు. ఎన్‌పిఎస్ (కేంద్ర ప్రభుత్వం) కింద పోగైన మొత్తం ఆస్తులు రూ.2లక్షల కోట్లకు పైనే వుండగా, రాష్ట్ర ఉద్యోగుల మొత్తం వాటా ఈ ఏడాది అక్టోబరు 31నాటికి రూ.3.5లక్షల కోట్లకు పైమాటే. రాజ్యసభలో ఒక ప్రశ్నకు రాతపూర్వకంగా సమాధానమిస్తూ ఆర్థిక శాఖ సహాయ మంత్రి డాక్టర్ భగవత్ కరద్ ఈ వివరాలను వెల్లడించారు.

పోలవరం ఉల్లంఘనలపై సుప్రీం నోటీసులు

- కేంద్రం, నాలుగు రాష్ట్రాలతో సహా పిపిఎకి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పోలవరం ప్రాజెక్టు పర్యావరణ ఉల్లంఘనలపై సుప్రీం కోర్టు నోటీసులు జారీ చేసింది. ఎన్‌జిటి తీర్పును సవాల్ చేస్తూ సామాజిక వేత్త పెంటపాటి పుల్లారావు దాఖలు చేసిన పిటిషన్‌ను గురువారం సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సుందరేషన్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరపున సుప్రీం కోర్టు న్యాయవాది శ్రావణ్ కుమార్ వాదనలు వినిపిస్తూ పర్యావరణ, అనుమతులు, పట్టిసీమ, పురుషోత్త పట్నం, పోలవరం డ్యాం వద్ద కొత్త లిఫ్ట్ పథకం ఉల్లంఘనలను లేవనెత్తారు. అంతే కాకుండా కాఫర్‌డ్యామ్ కారణంగా తరచుగా వరదలను పెరిగాయని వాదించారు. కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ నిషేధ ఉత్తర్వులు జారీ చేయడాన్ని కూడా లేవనెత్తారు. అనంతరం ధర్మాసనం కేంద్ర ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒరిస్సా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు, పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పిపిఎ)లకు నోటీసు జారీ చేశారు.

పూర్తిస్థాయి పెన్షన్ ఉద్యోగుల హక్కు

ప్రత్యేకవ్యాసం 4లో



సిఎం క్యాంపు కార్యాలయంలో పటేల్, పొట్టి శ్రీరాములకు నివాళులర్పిస్తున్న సిఎం జగన్మోహన్‌రెడ్డి

చరిత్రలో నిలిచేలా గృహ నిర్మాణం : మంత్రి జోగి రమేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

దేశ చరిత్రలో ఇప్పటిదాకా ఏ ప్రభుత్వమూ చేపట్టని రీతిలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టిందని రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ తెలిపారు. రాష్ట్రంలో 31 లక్షల మందికి ఇళ్లస్థలాలను ఇచ్చామని ఇందులో మొదటి విడత కింత 18.6 లక్షల ఇళ్లనిర్మాణం శరవేగంగా సాగుతున్నాయని అన్నారు. గురువారం తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కేంద్రం చెబుతున్న ఐదు ఇళ్లు తమ హాయంలోనివి కాదని అవి టిడిపి ప్రభుత్వంలో మంజూరు అయిన ఇళ్లని అన్నారు. 2023 మార్చినాటికి గృహనిర్మాణాలను పూర్తి చేసి ప్రవేశాలు చేయిస్తామని అన్నారు. రాష్ట్రంలో గృహనిర్మాణం విషయంలో తెలుగుదేశం చర్చకు రావాలన్నారు.

ప్రభుత్వ పథకాలపై టిడిపిది దుష్ప్రచారం : మంత్రి ఉషశ్రీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ప్రజల్లో వస్తున్న ఆదరణను చూసి తట్టుకోలేక తెలుగుదేశం పార్టీ తప్పుడు ప్రచారానికి దిగుతోందని రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి ఉషాశ్రీచరణ్ విమర్శించారు. గురువారం ఆమె తాడేపల్లిలో వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. చంద్రబాబునాయుడు తన 14 ఏళ్లలో ఒక్క మంచి పథకాన్ని కూడా తీసుకురాలేక పోయారని అన్నారు. రుణమాఫీ పేరుతో మహిళలను చంద్రబాబు మోసం చేశారని అన్నారు. మహిళలపై టిడిపి హయాంలో ఎన్ని దాడులు జరిగాయో రాష్ట్ర ప్రజలు చూశారని అన్నారు. జగన్ హయాంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందుతున్నాయని అందుకే ప్రభుత్వంపై దుష్ప్రచారానికి దిగుతున్నారని అన్నారు.

అక్రమ మద్యంపై ఉక్కుపాదం

ఎక్సైజ్ శాఖ మంత్రి నారాయణ స్వామి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో అక్రమ మద్యంపై ఉక్కుపాదం మోపాలని ఎక్సైజ్ శాఖ మంత్రి నారాయణ స్వామి అధికారులను ఆదేశించారు. సచివాలయంలో ఎక్సైజ్ శాఖపై గురువారం సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో మద్యం రిటైల్ అవుట్ లేట్లలో అవకతవకలు తమ దృష్టికి వచ్చాయని, వీటిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గంజాయి, మాదక ద్రవ్యాలపై నిఘా పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్ భార్గవ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

**స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501**కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

చెరువులో పడి తల్లీబిడ్డలు మృతి

ప్రజాశక్తి-ఓజిలి (తిరుపతి జిల్లా)

ప్రమాదవశాత్తు చెరువులో పడి తల్లీబిడ్డలు మరణించిన ఘటన తిరుపతి జిల్లా ఓజిలి మండలంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. కొత్తపేట గ్రామంలోని గిరిజన కాలనీకి చెందిన కోట్లపాటి సునీత (32) తన ఇద్దరు చిన్నారులు వైష్ణవి (9), వరుణ్‌తేజ (2)లను వెంటబెట్టుకుని బట్టలు ఉతికేందుకు కాలనీకి సమీపంలోని చెరువు వద్దకు వెళ్లారు. చెరువు ఒడ్డున ఆడుకుంటున్న పిల్లలు ప్రమాదవశాత్తు లోపలికి వెళ్లిపోయారు. వారిని కాపాడే క్రమంలో తల్లి కూడా లోపలికి వెళ్లిపోయారు. ఒడ్డుకు చేరుకోలేక తల్లీ బిడ్డలు మరణించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కెఎల్‌యు విద్యార్థి ఆత్మహత్య

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్ (గుంటూరు జిల్లా)

కె.ఎల్.యూనివర్సిటీ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం కుంచనపల్లిలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కోనసీమ జిల్లా రాజోలు గ్రామానికి చెందిన మందపాటి అజయ్ (20) కెఎల్‌యులో బిబిఎ మూడో సంవత్సరం, అదే ప్రాంతానికి చెందిన ఓ విద్యార్థిని బిబిఎ మొదటి సంవత్సరం చదువుతున్నారు. వీరిద్దరూ గత కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. కుంచనపల్లిలోని ఓ అపార్ట్‌మెంట్‌లో ఉంటూ తరగతులకు హాజరవుతున్నారు. ప్రేమ విషయంలో ఇద్దరి మధ్య వివాదం తలెత్తడంతో వారు ఉంటున్న అపార్ట్‌మెంట్‌లో అజయ్ బలవన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎకరాకు రూ.50 వేలు ఇవ్వాలి

కర్నూలు కలెక్టరేట్ ఎదుట తుపాను బాధిత రైతుల ధర్నా



కర్నూలు కలెక్టరేట్‌లోకి వెళ్తున్న రైతులను, నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు


ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

మాండూస్ తుపాను వల్ల నష్టపోయిన తమకు ఎకరాకు రూ.50 వేల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో కర్నూలు కలెక్టరేట్ ఎదుట గురువారం అన్నదాతలు ధర్నా చేశారు. అనంతరం వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చేందుకు కలెక్టరేట్‌లోకి వెళ్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. పోలీసులు, అధికారుల తీరుపై సిపిఎం నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ వచ్చి వినతిపత్రం తీసుకోవడానికి కూడా తీరిక లేదా? ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం రైతుల సమస్యలపై వ్యవసాయ శాఖ కార్యాలయ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు. అంతకుముందుకు సిపిఎం ఓల్డ్ సిటీ కార్యదర్శి ఎం.రాజశేఖర్ అధ్యక్షతన జరిగిన ధర్నాలో సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ మాట్లాడుతూ.. తుపాను ప్రభావంతో కర్నూలు జిల్లా వ్యాప్తంగా పత్తి, మిరప, వరి పంటలకు పెద్దఎత్తున నష్టం వాటిల్లిందన్నారు. టమోటా పంటకు గిట్టుబాటు ధర రాకపోవడంతో రైతులు మార్కెట్ యార్డుకు తీసుకొచ్చి తక్కువ ధరకు అమ్ముకుని నష్టపోతున్నారని తెలిపారు. వెంటనే కలెక్టర్ జోక్యం చేసుకొని తుపాను వల్ల జరిగిన నష్టాలను అంచనా వేసి ప్రభుత్వానికి నివేదించాలని డిమాండ్ చేశారు. నకిలీ విత్తనాలు సాగు చేసి నష్టపోయిన పత్తి రైతులను ఆదుకోవాలని కోరారు. లేనిపక్షంలో ఈ నెల 22న అన్ని వామపక్ష పార్టీలతో కలిసి వేలాది మంది రైతులతో కలెక్టరేట్ ముట్టడి చేపడతామని హెచ్చరించారు. ధర్నాలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పి.నిర్మల, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కెవి.నారాయణ, సిపిఎం న్యూ సిటీ కార్యదర్శి రాముడు, పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు ఈ.పుల్లారెడ్డి పాల్గొన్నారు. పత్తికొండలో ఆర్‌డిఓ కార్యాలయం వద్ద, ఆదోనిలో సబ్‌కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. ఎమ్మిగనూరులో రాస్తారోకో నిర్వహించి వ్యవసాయ శాఖ ఎడి ఖాద్రీకి వినతిపత్రం అందజేశారు.

రైతులను ఆదుకోవాలి

- సిఎస్‌కు చంద్రబాబు లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



మాండూస్ తుపాను ధాటికి పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డికి గురువారం లేఖ రాశారు. తుపాను ప్రభావంతో కురిసిన భారీవర్షాలతో ఎనిమిది జిల్లాల్లో పంటదెబ్బతిని రైతులకు వేలకోట్ల నష్టం జరిగిందని పేర్కొన్నారు. ఇటువంటి తీవ్ర పరిస్థితిలో కూడా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుగా ఉందని విమర్శించారు. ధాన్యం సేకరణ లక్ష్యంలో ప్రభుత్వం భారీగా కోత విధించిందని తెలిపారు. ప్రభుత్వ ఆంక్షలు, కొత్త నిబంధనల కారణంగా పంటను సరైన ధరకు అమ్ముకునే పరిస్థితి లేక రైతులు తీవ్రయాతన పడుతున్నారని తెలిపారు. ఆర్‌బికెల్లో ధాన్యం తేమశాతం ఎక్కువగా ఉందని, రంగు మారిందంటూ మద్దతు ధరల్లో పెద్దఎత్తున కోత పెడుతున్నారని పేర్కొన్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండుతుందని, అధికారులు అంచనా వేస్తే ప్రభుత్వం 37 లక్షల టన్నుల ధాన్యమే కొంటానని చెప్పిందని పేర్కొన్నారు. సేకరణ లక్ష్యాన్ని ప్రభుత్వం భారీగా తగ్గించడంతో, ప్రైవేట్ వ్యాపారులకు విక్రయిస్తూ రైతులు క్వింటాకు రూ.500 నుంచి రూ.700 వరకు నష్టపోతున్నారని పేర్కొన్నారు. వరి రైతులను గోనె సంచుల కొరత వేధిస్తోందని తెలిపారు. ప్రభుత్వానికి గతేడాది అమ్మిన ధాన్యం నేటికీ చెల్లింపులు జరగలేదని, ఇప్పుడు కొనుగోలు చేసిన రైతులకు చెల్లింపుల ప్రక్రియ కూడా మొదలు కాలేదని విమర్శించారు. రైతు రుణభారంలో రాష్ట్రం మొదటిస్థానంలో, రైతుల ఆత్మహత్యల్లో 3వ స్థానంలో, కౌలు రైతు ఆత్మహత్యల్లో 2వ స్థానంలో ఉందని వివరించారు. ప్రభుత్వ చర్యలతో ఇప్పటికే ఆక్వా రైతులు క్రాప్ హాలిడే ప్రకటించారని, ఇదే బాటలో మిగిలిన రైతులూ వెళ్లే పరిస్థితి నెలకొందని తెలిపారు. వారిపట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు అత్యంత బాధాకరమని, ఆదుకునేందుకు చర్యలు తీసుకొని వారికి అండగా నిలబడాలని సూచించారు. తరుగు లేకుండా ధాన్యం కొనుగోలు వెంటనే అన్ని జిల్లాల్లో ప్రారంభించాలని, సేకరణ లక్ష్యం పొరుగు రాష్ట్రం దామాషాలో పెంచాలని డిమాండ్ చేశారు. వరి, అపరాలకు ఎకరానికి రూ.20 వేలు, వాణిజ్య, ఉద్యానవన పంటలకు ఎకరానికి రూ.50 వేలు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ క్రాప్ ఇతర నిబంధనలు, ఆంక్షలు లేకుండా ఇన్సూరెన్స్ పరిహారం త్వరగా అందించాలని, కౌలు రైతులకు నేరుగా నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులు పంట నూర్పిన వెంటనే అక్కడే కొనుగోలు చేసే విధానం తీసుకురావాలని, తేమశాతంతో సంబంధం లేకుండా పంట అంతా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

19న కలెక్టరేట్ల వద్ద నిరసనలు

- రైతు సంఘం, కౌలు రైతు సంఘాల పిలుపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో మాండూస్ తుఫాన్ రైతులను తీవ్రంగా దెబ్బతీసిందని, ధాన్యం మొత్తం తడిసిపోయి కోలుకోలేని విధంగా నష్టపోయిన రైతులను, కౌలు రైతులను ఆదుకోవాలని ఎపిరైతుసంఘం, ఎపి కౌలు రైతు సంఘం డిమాండ్ చేశాయి. వరదబాధిత రైతాంగాన్ని ఆదుకుకోవాలని కోరుతూ ఈ నెల 19న అన్ని జిల్లా కలెక్టరేట్ల వద్ద నిరసన కార్యక్రమాలను చేపట్టనున్నట్లు ప్రకటించాయి. ఈ మేరకు ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు వి కృష్ణయ్య, కె ప్రభాకర్‌రెడ్డి, ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు రాధాకృష్ణ, హరిబాబులు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. తుఫాను బాధిత రైతులకు ప్రతి ఎకరాకు రూ.25 వేలు పరిహారమివ్వాలని, రబీ పంటకు ఉచితంగా విత్తనాలు, ఎరువులు ఇవ్వాలని కోరారు. నిబంధనలు సడలించి బీమా వర్తింపజేయాలని, తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయాలన్నారు. 19న చేపట్టే నిరసనల్లో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

2023లో 23 సాధారణ సెలవులు

- 22 ఐచ్చిక సెలవులు
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

2023 సంవత్సరానికి ప్రభుత్వ ఉద్యోగులకు, విద్యాసంస్థలకు సాధారణ సెలవులు, ఐచ్చిక సెలవుల జాబితాను రాష్ట్ర ప్రభుత్వం గురువారం విడుదల చేసింది. మొత్తం 23 సాధారణ సెలవులను, 22 ఐచ్చిక సెలవులను ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి డాక్టర్ కెఎస్ జవహర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. అయితే అంతర్జాతీయ కార్మిక దినోత్సవం అయిన మేడే నాడు ఎలాంటి సెలవును ప్రకటించకపోవడం చర్చనీయాంశమైంది. ప్రపంచవ్యాప్తంగా కార్మికులు, ఉద్యోగులు తమ హక్కుల దినంగా జరుపుకునే మేడేను రాష్ట్ర ప్రభుత్వం సెలవుల జాబితా నుండి తొలగించడం పట్ల సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది.

సాధారణ సెలవులు

జనవరిలో 14న భోగి, 15న మకర సంక్రాంతి, 16న కనుమ, 26న రిపబ్లిక్‌డే, ఫిబ్రవరిలో 18న మహాశివరాత్రి, మార్చిలో 8న హోళి, 22న ఉగాది, 30న శ్రీరామనవమి, ఏప్రిల్‌లో 5న బాబుజగజ్జీవన్‌రామ్ జయంతి, 7న గుడ్ ఫ్రైడే, 14న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి, 22న రంజాన్, జూన్‌లో 29న బక్రీద్, జులైలో 29న మొహర్రం, ఆగస్టులో 15న స్వాతంత్ర్య దినోత్సవం, సెప్టంబర్‌లో 6న శ్రీకృష్టాష్టమి, 18న వినాయక చవితి, 28న ఈద్‌మిలానడబి, అక్టోబర్‌లో 2న గాంధీ జయంతి, 22న దుర్గాష్టమి, 23న విజయదశమి, నవంబర్‌లో 12న దీపావళి, డిశంబర్‌లో 25న క్రిస్టమస్‌ను సాధారణ సెలవులుగా ప్రకటించారు.

ఐచ్చిక సెలవులు

జనవరిలో 1న నూతన సంత్సరం, ఫిబ్రవరిలో 2న హజరత్‌అలీ జయంతి, మార్చిలో 7న షబ్-ఎ-బరాత్, ఏప్రిల్‌లో 4న మహావీర్ జయంతి, 18న షబ్-ఎ-ఖాదర్, 21న జుముతాల్ వాడా, 23న బసవజయంతి, 24న షహదత్ హ‌జ్రత్ అలీ, మేలో 5న బుద్ధపూర్ణిమ, జూన్‌లో 20న రథయాత్ర, జూలైలో 6న ఈద్-ఎ-ఘదీర్, 28న మొహర్రం, ఆగస్టులో 16న పార్శీ కొత్త సంవత్సరం, 25న వరలక్ష్మి వ్రతం, సెప్టంబర్‌లో 5న ఆర్బీన్, 9న హజరత్ సయ్యద్ మొహ్మద్ జువాన్‌పురి జయంతి, అక్టోబర్‌లో 14న మహాలయ అమవాస్య, 24న విజయదశమి, 26న ఎజ్-దుహుమ్-షరీఫ్‌కు, నవంబర్‌లో 27న కార్తీక పౌర్ణమి/గురునానక్ జయంతి, డిశంబర్‌లో 24న క్రిస్టమస్ ఈవ్, 26న బాక్సింగ్‌డేని ఐచ్చిక సెలవులుగా ప్రకటించారు.

సంగం డెయిరీని ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుంది : మంత్రి సీదిరి అప్పలరాజు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పాడిరైతులను మోసం చేస్తున్న సంగం డెయిరీని రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందని రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పల రాజు తెలిపారు. గురువారం తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. చిత్తూరు డెయిరీని చంద్రబాబు నాయుడు పూర్తిగా నిర్వీర్యం చేశారని, రోజుకు రెండున్నర లక్షల పాలు వచ్చే డెయిరీని అన్యాయంగా మూసేయించారని అన్నారు. చిత్తూరు డెయిరీని మూత వేయించి హెరిటేజ్‌ను స్థాపించారని అన్నారు. సంగం డెయిరీ కూడా ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో వుందని దాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకుం టుందని తెలిపారు. అసలు సంగం డెయిరీ ప్రస్థానం ఎలా జరిగిందో ప్రజలకు వాస్తవాలను వివరిస్తామని తెలిపారు. పాడిరైతుల డబ్బుతో స్థలం కొని మొదట డెయిరీ ప్రారంభించారన్నారు. మిల్క్ యూనియన్‌కి అధ్యక్షుడైన ధూళిపాళ్ల వీరయ్య చౌదరి మొత్తం కథ నడిపారని, పదిఎకరాల స్థలాన్ని సొంతానికి కొనుగోలు చేశారన్నారు. ప్రభుత్వానికి సంబంధించిన ఆస్తులు ఉంటే వాటిని తిరిగి ఇచ్చేసి, కలెక్టర్ దగ్గర నో అబ్జక్షన్ సర్టిఫికెట్ తీసుకున్నాకనే మ్యాక్స్ చట్టంలోకి ఏ డెయిరీ అయినా వెళుతుందన్నారు. కానీ సంగం విషయంలో అవేమీ జరగకుండానే మ్యాక్స్ చట్టంలోకి తెచ్చుకున్నారని అన్నారు. డెయిరీని పూర్తి చట్టవిరుద్ధంగా నిర్వహిస్తున్నారని అన్నారు.

21న ఘనంగా సిఎం జన్మదినోత్సవం

- సజ్జల రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో పెద్దఎత్తున సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ప్రజల హృదయాల్లో నిలిచిపోయిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఈనెల 21న రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి తెలిపారు. గురువారం తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఈ మేరకు ముఖమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలకు సంబంధించి ప్రత్యేక వెబ్‌సైట్‌ను సజ్జల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సిఎం జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకల్లో రాష్ట్రంలో సంక్షేమ పథకాలతో లబ్దిపొందిన వారంతా పాల్గొననున్నారని తెలిపారు. గత ఏడాది పార్టీ కార్యకర్తలు 38 వేల యూనిట్ల రక్తదానం చేశారని, ఈ ఏడాది కూడా కూడా ఇస్తారని అన్నారు. బ్లడ్ డొనేషన్.కామ్ పేరిట వెబ్‌సైట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. బ్లడ్ డొనేషన్ చేసేవారి పేర్లు నమోదు చేసుకుంటే అవసరమైనప్పుడు రక్తదానం చేసే అవకాశం ఉందన్నారు. ఈనెల 19న రాష్ట్ర వ్యాప్తంగా క్రీడాపోటీలు, 20న మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 21న పేదలకు అన్నదానం సేవాకార్యక్రమాలను ఏర్పాటు చేస్తామన్నారు.



నెల్లూరులో చేపట్టిన ధర్నాలో మాట్లాడుతున్న పిల్లలమర్రి బాలకృష్ణ

చేనేతపై జిఎస్‌టి ఎత్తేయాలి

గుంటూరు, నెల్లూరులో కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-గుంటూరు/ నెల్లూరు

చేనేతపై ప్రభుత్వం విధిస్తున్న జిఎస్‌టిని పూర్తిగా రద్దు చేయాలని, బడ్జెట్‌లో కేటాయింపులు పెంచాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యాన నెల్లూరు, గుంటూరు జిల్లాలో నేత కార్మికులు గురువారం ధర్నాలు చేశారు. చేనేత పరిరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని, ప్రతి కార్మికుడికి నేతన్న నేస్తం ఇవ్వాలని, పట్టు నూలు ధరలు తగ్గించాలని నినదించారు. అనంతరం అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. నెల్లూరులోని జౌళి శాఖ కార్యాలయం వద్ద ధర్నాలో ఎపి చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ మాట్లాడుతూ.. 2023 బడ్జెట్‌లో చేనేత రంగానికి కేంద్రం రూ.5 వేల కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.వెయ్యి కోట్లు కేటాయించాలని, వైఎస్‌ఆర్ నేతన్న నేస్తం పథకం ప్రతి చేనేత కార్మికునికి, చేనేతకు కేటాయించిన 11 రకాల రిజర్వేషన్లను ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి చేనేత కార్మికుడికి అంత్యోదయ కార్డులు అందజేయాలని, బోగస్ చేనేత సహకార సంఘాలను రద్దు చేయాలని, సహకార సంఘాలకు చెల్లించాల్సిన ఆప్కో బకాయిలు ప్రభుత్వం తక్షణమే చెల్లించాలన్నారు. రాష్ట్రంలో టెక్స్‌టైల్ పార్కులు ఏర్పాటు చేసే ఆలోచన మానుకొని చేనేత పార్కులు ఏర్పాటు చేసే దిశగా ఆలోచన చేయాలన్నారు. చేనేత కార్మికులకు వెల్ఫేర్ ఫండ్ బోర్డు ఏర్పాటు చేయాలని, హెల్త్ కార్డులు అందజేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేశారు. గుంటూరులో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.వెంకటేశ్వరరావు, డి.రామారావు మాట్లాడుతూ వ్యవసాయం తరువాత ప్రధాన వృత్తిగా ప్రసిద్ధి చెందిన చేనేత పరిశ్రమ కార్పొరేట్ విధానాల వల్ల సంక్షోభంలో చిక్కుకుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికులందరికీ రూ.24 వేలు ఇస్తామని హామీ ఇచ్చి, సొంతింటిలో మగ్గాలపై నేస్తున్న వారికే ఇచ్చి చేతులు దులుపుకుందని విమర్శించారు. చేనేత పరిరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం చేనేత జౌళిశాఖ ఎడికి వినతి పత్రం అందజేశారు.

కేంద్ర ప్రకటనలపై వైసిపి స్పందించాలి

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి-ఉక్కునగరం, విశాఖ

విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై కేంద్ర ప్రభుత్వం అనేక ప్రకటనలు చేస్తున్నప్పటికీ అధికారపార్టీకి చెందిన నాయకులు స్పందించకపోవడాన్ని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు విమర్శించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ కూర్మన్నపాలెంలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి 672వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో స్టీల్‌ప్లాంట్ ఎఫ్‌ఎండి, ఆర్‌ఎస్‌ఎండ్ ఆర్‌ఎస్, సిఎంఇ, విఎస్‌జిహెచ్, ప్లాంట్ డిజైన్ విభాగాల ప్రతినిధులు, కార్మికులు కూర్చున్నారు. ఈ దీక్షలనుద్దేశించి పోరాట కమిటీ ప్రతినిధులు డి ఆదినారాయణ, ఎన్ రామారావు, సిహెచ్ సన్యాసిరావు, శ్రీనివాస్‌నాయుడు, శ్రీనివాసు మాట్లాడారు. కార్మికుల హక్కులను హరిస్తూ తమ ఇష్టమొచ్చినట్లు విశాఖ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యాన్ని బిజెపి ఆడిస్తోందని విమర్శించారు. ఈ పరిణామాలకు వ్యతిరేకంగా రానున్న కాలంలో ప్రజా ఉద్యమంగా మలిచేలా కార్మికులు పోరాటానికి సిద్ధపడాలని పిలుపునిచ్చారు. ఈ దీక్షల్లో వి ప్రసాద్, కె బాలశౌరి, బాలకృష్ణ, సిహెచ్ వెంకటరావు, అడారి బాలశ్రీను, వై వెంకటేశ్వరరావు, ఎ నాగేశ్వరరావు కార్మికులు పాల్గొన్నారు.

విద్యా సంస్కరణల్లో రాష్ట్రాన్ని ముందుంచాలి : బొత్స

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యా సంస్కరణల ద్వారా రాష్ట్రాన్ని ప్రథమ స్థానంలో నిలబెట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. ఎస్సిఇఆర్‌టి, ఎన్‌సిఇఆర్‌టి సంయుక్తంగా 'పుస్తకాల ప్రచురణ ప్రతిపాదన' అనే అంశంపై చర్చ గురువారం జరిగింది. సమగ్ర శిక్షా కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ ఈ నెల 21 నుంచి 8వ తరగతి విద్యార్థులకు బైజూస్ కంటెంట్ అప్‌లోడ్ ట్యాబుల పంపిణీ చేస్తామన్నారు. జెఎన్‌టియు మాజీ విసి ఛాన్సలర్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్, కమిషనర్ ఎస్ సురేష్ కుమార్, ఎస్‌ఎస్‌ఎ ఎస్‌పిడి బి శ్రీనివాసరావు, సీమ్యాట్ డైరెక్టర్ విన్ మస్తానయ్య పాల్గొన్నారు.



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ఆండ్ర మాల్యాద్రి

మతం మారారని రిజర్వేషన్లను నిరాకరించడం రాజ్యాంగ విరుద్ధం

- కెవిపిఎస్ రౌండ్‌టేబుల్‌లో వక్తలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మతం మారారనే కారణంతో దళిత క్రైస్తవులకు, ముస్లిములకు రిజర్వేషన్లను నిరాకరించడం రాజ్యాంగ విరుద్ధమని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) రౌండ్‌టేబుల్ సమావేశంలో పలువురు వక్తలు పేర్కొన్నారు. దేశంలో ప్రజలకు రాజ్యాంగం కల్పించిన మత స్వేచ్ఛకు భిన్నంగా కేంద్రంలో బిజెపి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును సర్వత్రా వ్యతిరేకించాలని ఈ సమావేశం తీర్మానించింది. గురువారం విజయవాడలోని ఎంబివికెలో దళిత క్రైస్తవ, ముస్లిములకు రిజర్వేషన్లను ఇవ్వబోమంటూ కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో వేసిన అఫిడవిట్‌ను ఉపసంహరించుకోవాలని, జస్టిస్ రంగనాథ్ మిశ్రా సిఫార్సులను అమలు చేయాలని కోరుతూ కెవిపిఎస్ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించింది. కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు మాట్లాడారు. దళితులకు మతం మారినంత మాత్రాన సామాజికంగా ఎదురవుతున్న వివక్ష పోదని అన్నారు. ఎస్‌సి కోటా రిజర్వేషన్లో ఉద్యోగం పొంది చర్చీలకు వెళితే క్రైస్తవులుగా గుర్తించి వారిని ఉద్యోగాల నుండి భర్తరఫ్ చేయ్యాలన్న మద్రాస్ హైకోర్టు తీర్పు సామాజిక న్యాయానికి విఘాతం కలిగిస్తోందని తెలిపారు. దళిత క్రైస్తవ, ముస్లిములకు ఎస్‌సి రిజర్వేషన్లను కొనసాగించాలని డిమాండ్ చేశారు. దళితులు, ముస్లిముల స్థితిగతులపై అధ్యయనం చేసి సామాజిక భద్రత కల్పించాలన్న లక్ష్యంతో వేసిన రంగనాథ మిశ్రా సిఫార్సులను అమలు చేయబోమని కోర్టుకు నివేదించడం తగదని అన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం క్రమేణా రిజర్వేషన్లను ఎత్తివేసేందుకు కుట్రలు చేస్తోందని విమర్శించారు. దళిత క్రైస్తవులకు, ముస్లిములకు ఎస్‌సి రిజర్వేషన్లను కొనసాగించాలని ఇందుకు ఐక్య ఉద్యమాలకు శ్రీకారం చుట్టాలని అన్నారు. డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు, జైభీం భారత పార్టీ రాష్ట్ర నాయకులు వై కొండలరావు, డిబిఎఫ్ జాతీయ అధ్యక్షులు మేళం భాగ్యారావు, ఎన్‌సిడిసి జాతీయ నాయకులు ఇసుకుల జయరాజు, డిబిఎస్‌యు రాష్ట్ర నాయకులు కెసిహెచ్ బంగార్రాజు, ఎస్‌సిఎస్‌టి ఆర్‌పిఎస్ నాయకులు బిఆర్ సోమన్న, క్రైస్తవ ఆంధ్ర సమితి అధ్యక్షులు ఎస్ సుదర్శనరావు, కెవిపిఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి జి క్రాంతి కుమార్ తదితరులు మాట్లాడారు. మద్రాస్ హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో ఛాలెంజ్ చేయగా కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని దళిత క్రైస్తవులకు వ్యతిరేకంగా అఫిడవిట్ వేయ్యడం సరికాదన్నారు. వారి రిజర్వేషన్లపై రిటైర్డ్ ఛీఫ్ జస్టీస్ బాలకష్ణన్ ఆధ్వర్యంలో కమిషన్ వేసి రెండేళ్ల లోపల నివేదిక ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం గడువు ఇవ్వడం తగదని అన్నారు. బిజెపి నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం దళితులు హిందూమతాన్ని వదిలి వేరేమతంలోకి మారితే రిజర్వేషన్లు వర్తించకూడదనే నిర్ణయం కులవ్యవస్థను కాపాడుకునేందుకేనని విమర్శించారు. దళిత కైస్తవులను ఎస్‌సిలుగా గుర్తించేందుకు పెద్దఎత్తున ఉద్యమ కార్యాచరణకు శ్రీకారం చుట్టాలని అన్నారు. ఈ మేరకు అన్ని జిల్లాలో దళిత, గిరిజన, క్రిష్టియన్, ముస్లిం, ప్రజా సంఘాలను కలుపుకుని సమావేశాలను జరపాలని రౌండ్‌టేబుల్ సమావేశం తీర్మానించింది.

అవినీతి వద్దని జగన్ చెప్పడం హాస్యాస్పదం

- టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు యనమల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అవినీతి వద్దని అవినీతిపరుడైన ముఖ్యమంత్రి చెప్పడం హాస్యాస్పదమని శాసనమండలి ప్రతిపక్ష నేత, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు విమర్శించారు. దేశంలోనే అత్యంత అవినీతి పరుల జాబితాలో అగ్రస్థానంలో ఉన్న జగన్ అవినీతి చేయడానికి వీల్లేదని చెప్పడం అతిపెద్ద జోక్ అని పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. అక్రమ మైనింగ్‌లో రాష్ట్రం మూడోస్థానంలో ఉందని తెలిపారు. మద్యనిషేధం పేరుతో రాష్ట్రంలో వ్యాపారం మొత్తాన్ని శాసిస్తూ ఇప్పటికే రూ.30 వేల కోట్లు కొల్లగొట్టారని విమర్శించారు. విశాఖ రాజధాని పేరుతో జగన్, విజయసాయిరెడ్డి రూ.40 వేల కోట్ల విలువైన భూములను తమ ఖాతాల్లో వేసుకున్నారని విమర్శించారు.

పాడిపరిశ్రమ వినాశనం కోసమే 'అమూల్' : పట్టాభి

సహకార డైయిరీలను నామరూపాలు లేకుండా నాశనం చేయాలన్న కుతంత్రంతో సిఎం జగన్ అమూల్ జపం చేస్తున్నారని టిడిపి అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ విమర్శించారు.

వణికిపోతున్న సుబ్రహ్మణ్యం తల్లిదండ్రులు : వర్ల రామయ్య

వైసిపి ఎంఎల్‌సి అనంతబాబు బెయిల్‌పై బయటకు రావడంతో సుబ్రహ్మణ్యం తల్లిదండ్రులు వణికిపోతున్నారని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య అన్నారు. మృతుడి తరపున పోరాడిన దళిత నేతలు కూడా ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని భయంతో వణికిపోతున్నారని పేర్కొన్నారు.

డ్వాక్రా సంఘాల రుణాలు చెల్లింపు 99.50శాతం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో డ్వాక్రా సంఘాల మహిళలు తీసుకున్న రుణాలను క్రమం తప్పకుండా నాటికి 99.50శాతం రికవరీతో చెల్లిస్తున్నారని గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ(సెర్ప్) ముఖ్యకార్య నిర్వహణాధికారి(సిఇవో) ఎఎండి ఇంతియాజ్ వెల్లడించారు. 91శాతం సంఘాలు ఎ,బి గ్రేడ్‌లలో కొనసాగుతున్నాయని తెలిపారు. సెర్ప్ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రతిఏటా రూ.20వేల నుంచి 30వేల కోట్ల వరకు బ్యాంకుల నుంచి డ్వాక్రా సంఘాలు రుణాలు పొందుతున్నాయని తెలిపారు.

ఆర్‌టిసి విధ్వంసానికి కుట్ర..!

(మొదటిపేజీ తరువాయి)

వాటిని విస్మరించారని విమర్శించారు. పిఆర్‌సి గురించి మాట్లాడితే ఉద్యోగులను అరెస్టు చేస్తున్నారన్నారు. కనీసం మాట్లాడే స్వేచ్ఛ కూడా లేకుండా పోయిందని తెలిపారు. పలు సమస్యల పరిష్కారం కోసం ఆర్‌టిసి కార్మికులు, ప్రభుత్వోద్యోగులు కలిసి ఉద్యమం చేస్తున్నారన్నారు. ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జిలానీ, సుందరయ్య, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


శ్రీవారి ఆలయం ఎదుట సినీనటుడు రజనీకాంత్

శ్రీవారిని దర్శించుకున్న రజనీకాంత్

ప్రజాశక్తి -తిరుమల,కడప

తిరుమల శ్రీవారిని సినీనటుడు రజనీకాంత్ దర్శించుకున్నారు. గురువారం ఉదయం విఐపి బ్రేక్ దర్శన సమయంలో శ్రీవారి సుప్రభాత సేవలో కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. కూతురు ఐశ్వర్య రజనీకాంత్‌తో కలిసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయం వెలుపల రజనీకాంత్‌ను చూడటానికి భక్తులు ఉత్సాహం చూపారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆయన కడప జిల్లాకు బయలుదేరారు. మ్యూజిక్ డైరెక్టర్ రెహమాన్‌తో కలిసి అమీన్‌పీర్ దర్గాను సందర్శించారు. కూతురితో కలిసి రజనీకాంత్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

'అడ్వాన్సు' అక్రమాలపై సిఐడికి ఫిర్యాదు

- మంత్రి నాగార్జున

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి ప్రభుత్వ హయాంలో వివిధ రకాల వాహనాలు సరఫరా చేయడానికి ఎస్‌సి కార్పొరేషన్ నుంచి అడ్వాన్సులు తీసుకొని వాహనాలను సరఫరా చేయని డీలర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. ఈ అంశంపై సిబిసిఐడితో దర్యాప్తు చేయించాలని అధికారులను ఆదేశించారు. ఎస్‌సి కార్పొరేషన్ కార్యాలయంలో కమిటీ ఆఫ్ పర్సన్స్(సిఓపి) 11వ సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వ హయాంలో కొన్ని సంస్థలు ఇ-ఆటోలు, ట్రాక్టర్లు, మిషన్ డ్రెయిన్ క్లీనర్ల సరఫరా కోసం టెండర్లు పొంది ప్రభుత్వం నుంచి కోట్లాది రూపాయలు అడ్వాన్సుగా తీసుకున్నాయని తెలిపారు. ఈ సమావేశంలో రెల్లి కార్పొరేషన్ చైర్మన్ మధుసూదన్ రావు, సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ హర్షవర్ధన్ పాల్గొన్నారు.

పొగాకు రైతు గుల్ల


టంగుటూరులో నీట మునిగిన పొగాకు

- మాండూస్ తుపాను మిగిల్చిన నష్టం
- ప్రకాశం జిల్లాలో 25 వేల ఎకరాల్లో దెబ్బతిన్న పంట
- రూ.125 కోట్ల నష్టం!

ప్రజాశక్తి- ఒంగోలు బ్యూరో

మాండూస్ తుపాను పొగాకు రైతులను గుల్లగుల్ల చేసింది. చేతికందే దశలో తుపాను వల్ల కురిసిన భారీ వర్షాలకు పొగాకు తోటలు నిలువునా దెబ్బతిన్నాయి. నీటిలో తేలాడాయి. వర్షం తగ్గగానే తోటలు వాడిపోతున్నాయి. మరో రెండు రోజుల్లో ఎంత నష్టం అనేది తేలనుంది. ఇప్పటివరకూ అందిన సమాచారం మేరకు ప్రకాశం జిల్లాలో 25 వేల ఎకరాల్లో పంట నష్టం జరిగింది. తోటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఇంకా కొన్ని ప్రాంతాల్లో తోటల్లో నీరు ఉంది. దిగుబడి తగ్గనుంది. మొక్కలు ఉరకెత్తిపోతున్నాయి. కొన్ని కోలుకున్నా నష్టం తప్పదు. వీటిని పీకేసి మళ్లీ నాట్లు వేయడం తప్ప మరో మార్గం కనిపించడం లేదని రైతులు వాపోతున్నారు. నష్టం రూ.125 కోట్ల వరకూ ఉంటుందని చెప్తున్నారు.

కొండపి, టంగుటూరు ప్రాంతాల్లో భారీ నష్టం

కొండపి, టంగుటూరు వేలం కేంద్రాలతోపాటు ఒంగోలు చుట్టుపక్కల ప్రాంతాల్లో పొగాకు బాగా దెబ్బతింది. నల్లరేగడి నేలలు కావడంతో నష్టం ఎక్కువగా ఉంది. కొండపి వేలం కేంద్రం పరిధిలో 16 వేల ఎకరాల్లో పొగాకు వేశారు. వర్షాలకు సగానికిపైగా పంట పూర్తిగా దెబ్బతింది. మిగతా పంట ఎంత మేరకు చేతికందుతుందో కూడా స్పష్టత లేదు. మర్రిపూడి, కొండపి మండలాల్లో ఇప్పటికే ఒకసారి ఆకును కోశారు. బ్యారన్‌లో పెట్టారు. క్యూరింగు కూడా మొదలైంది. ఈ ప్రాంతంలో ఇప్పటికే ఎకరాకు రూ.50 వేల వరకూ పెట్టుబడి పెట్టారు. నాట్లు వేయడం, సాగు, ఎరువులు, ఆకుకొట్టుడు, క్యూరింగు వంటి పనులకు భారీగానే పెట్టుబడి పెట్టాల్సి ఉంది. టంగుటూరు మండలంలోనూ సుమారు ఎనిమిది వేల ఎకరాల్లో పంట బాగా దెబ్బతిన్నట్లు అంచనా. ఒంగోలు, మేదరమెట్ల, వెల్లంపల్లి కేంద్రాల పరిధిలోనూ సుమారు పది వేల ఎకరాల్లో పొగాకు తోటలు నీటమునిగాయి.

క్యూరింగు మొదలయ్యే దశలో..

పొగాకు క్యూరింగు మొదలైంది. కొన్ని ప్రాంతాల్లో ముందుగా నాట్లు వేసిన రైతులు ఒకసారి ఆకుకొట్టారు. క్యూరింగులో ఉన్నారు. అంటే పంట చేతికి అందే దశ. ఇలాంటి సమయంలో వర్షాలు నిలువునా ముంచాయి. పెట్టుబడులు కూడా 75 శాతం పెట్టారు. పంట ఆశాజనకంగా ఉంది. కర్ణాటకలో ఈ ఏడాది కిలో పొగాకు రూ.200 ధర పలికింది. ధరలపై రైతులు ఆశగా ఉన్నారు. అంతా సవ్యంగా ఉంటే ఈ ఏడాది మంచి ధరలు వస్తాయని భావించారు. ఇప్పుడు భారీ వర్షాలు నిలువునా ముంచాయి. పంట దిగుబడి భారీగా తగ్గే అవకాశాలున్నాయి. రాష్ట్రంలో ఈ ఏడాది పొగాకు బోర్డు 142 మిలియన్‌ల కిలోల పొగాకు పండించడానికి అనుమతి ఇచ్చింది. ఇందులో 70 శాతం ప్రకాశం జిల్లాలోనే పండుతుంది. కీలకమైన సమయంలో తోటలు దెబ్బతినడంతో ఈ ఏడాది అనుమతి కన్నా తక్కువగా దిగుబడి వచ్చే అవకాశం ఉంది.

స్పందించని కేంద్రం

జిల్లాలో అన్ని రకాల పంటలూ సుమారు లక్ష ఎకరాల్లో నీటమునిగాయి. వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనాల్లోనే 32 వేల ఎకరాల్లో పంట దెబ్బతిన్నట్లు గుర్తించారు. పొగాకుకు ఎక్కువ నష్టం కనిపిస్తోంది. కేంద్రం ఇంత వరకూ స్పందించలేదు. పొగాకు బోర్డు ద్వారా రైతులను ఆదుకునే చర్యలు కనిపించలేదు. ఎంపిలు ఇక్కడ కనీసం రైతులను పరామర్శించే పరిస్థితి కూడా లేదు.

ఆదుకోవాలి



నాతోపాటు మా కుటుంబ సభ్యులు, సమీప బంధువులందరం కలిసి ఈ ఏడాది 130 ఎకరాల్లో పొగాకు సాగు చేపట్టాం. ఎకరాకు రూ.60 వేల నుండి రూ.లక్ష వరకూ పెట్టుబడి అయింది. మాండూస్ తుపాను వల్ల పంటంతా వర్షం నీటిలో మునిగింది. నీటిని బయటకు పంపే మార్గం లేదు. ఎంత తక్కువగా అనుకున్నప్పటికీ రూ.కోటి దాకా నష్టం వస్తుంది. పొగాకు బోర్డు అధికారులు నష్టం నివేదికలు రూపొందించి రైతులను ఆదుకోవాలి.

-మొలకలపల్లి కోటేశ్వరరావు, ఉప సర్పంచ్, పొగాకు రైతు, సూరారెడ్డిపాలెం.

రూ.68 లక్షలు బూడిదలో పోసిన పన్నీరే



ఈ ఏడాది 105 ఎకరాల్లో పొగాకు సాగు చేపట్టాను. ఇప్పటి వరకూ పొలం దుక్కు దున్నడం, గొర్రు తోలకం, పొగనారు, కూలీలు తదితర ఖర్చులన్నీ కలుపుకొని రూ.68 లక్షలు పెట్టుబడి అయింది.

మాండూస్ నిలువునా ముంచింది. ప్రస్తుత పరిస్థితి చూస్తే అర ఎకరా కూడా పనికొచ్చే పరిస్థితి లేదు. పొగాకు బోర్డు, ప్రభుత్వం త్వరితగతిన స్పందించి పొగాకు రైతులను ఆదుకోవాలి.

-ఉప్పలపాటి రామరాజు, పొగాకు రైతు, కందులూరు

అందని మార్కెట్ రుణాలు

- వరుస రెండు వేలంలోనూ నిరాసే
- అందుకే ఓవర్‌డ్రాఫ్ట్‌పైనే ఆధారం
- వరుసగా ఓడీలతోనే కాలక్షేపం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి



ప్రతి వారం రిజర్వ్‌బ్యాంకు నిర్వహించే బహిరంగ మార్కెట్ రుణాల వేలం పాటలో రాష్ట్రానికి ఎదురుదెబ్బ తగులుతోంది. ఈ నెల ఇప్పటివరకు జరిగిన రెండు వేలంలో రాష్ట్రానికి అవకాశం లేకుండాపోయింది. కేంద్రం ప్రకటించిన పరిమితికి మించి రుణాలు తీసుకోవడం వల్లనే కొత్త రుణాలకు అవకాశం లేకుండాపోయిందని అధికారులు అంగీకరిస్తున్నారు. అందుకే ఎక్కువగా ఓవర్‌డ్రాఫ్ట్‌పైనే ఆధార పడాల్సి వస్తోందని వారంటున్నారు. రాష్ట్రానికి దాదాపు 48 వేల కోట్లు రుణం తీసుకునేందుకు అనుమతి ఇవ్వగా, అది ఇప్పటికే దాటిపోయినట్లు తేలింది. అదనపు రుణానికి అనుమతి ఇవ్వాలని పలు దఫాలుగా కేంద్రానికి రాష్ట్ర ఆర్థికశాఖ లేఖలు రాసినప్పటికీ సానుకూల స్పందన లభించడం లేదని చెబుతున్నారు. అందుకే రెండు సెక్యూరిటీ వేలాల్లోనూ రుణానికి రాష్ట్రం దరఖాస్తు కూడా చేసుకోలేదని ఒక అధికారి వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలోనే ఈ వారంలోనే ఢిల్లీకి వెళ్లాలని ఆర్థికశాఖ అధికారులు యోచిస్తున్నట్లు తెలిసింది. కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ అధికారులతో భేటీ అయి కొత్తగా అదనపు రుణాన్ని కోరాలని భావిస్తున్నారు. మార్కెట్ రుణాలు అందుబాటులో లేకపోవడం వల్ల ఈ నెల అంతా ఓవర్‌డ్రాఫ్ట్‌లతోనే కాలక్షేపం చేయాల్సి వచ్చింది. తొలి రోజే ఓడీతో ప్రారంభమైన ఖజానా ఎనిమిది రోజులపాటు అదే తోవలో పయనించింది. ఓడీ పరిమితి దాటిపోతున్న నేపథ్యంలో కొత్తగా ఇతర సంస్థల పేరిట రుణాలు తీసుకువచ్చి ఓవర్‌డ్రాఫ్ట్ నుంచి బయటకు వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. అయితే 13వ తేదీన మళ్లీ 2100 రూపాయల వరకు ఓడీలోకి వెళ్లడం గమనార్హం. ఇదే తరహాలో మళ్లీ మళ్లీ తిరిగి ఓడీలోకి వెళ్లకతప్పని పరిస్థితులు నెలకొంటున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కార్మికుల హక్కుల కోసం ఉద్యమం

- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గఫూర్

ప్రజాశక్తి - తణుకురూరల్ (పశ్చిమగోదావరి)

కార్మికుల హక్కుల కోసం ఉద్యమించాలని, చట్టాల పరిరక్షణకు నిరంతర పోరాటాలు సాగించాలని మాజీ ఎమ్మెల్యే, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఎ.గఫూర్ అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా తణుకులోని స్థానిక ఎన్‌జిఒ హోమ్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జనవరి రెండు, మూడు, నాలుగు తేదీల్లో భీమవరంలో జరిగే సిఐటియు రాష్ట్ర 16వ మహాసభను జయప్రదం చేయాలని కోరారు. ఈ మహాసభలో కార్మికుల అపరిష్కృతమైన డిమాండ్లపై చర్చించి, పరిష్కార మార్గాలు రూపొందించనున్నామన్నారు. కార్మిక వర్గాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరించాయని విమర్శించారు. కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం మార్చేసి లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందని తెలిపారు. ఇది యజమానులకు ఉపయోగమని, కార్మికులకు కాదని తెలిపారు. అన్ని దేశాల్లో కార్మికులు సమ్మె చేస్తున్నారని, ఇండియాలో కార్మికులు సమ్మె చేయడానికి వీలులేదని నరేంద్రమోడీ ప్రభుత్వం చెప్పడం దారుణమన్నారు. ఈ లేబర్ కోడ్‌లను పార్లమెంటులో వైసిపి బలపర్చడం దారుణమన్నారు. 20 సంవత్సరాల నుండి వేతన సవరణ లేదని విమర్శించారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్, కార్యదర్శి పివి.ప్రతాప్ పాల్గొన్నారు.


ఎమ్మెల్యే తిప్పేస్వామికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న వైసిపి అసమ్మతి నేతలు

ఈ ఎమ్మెల్యే మాకొద్దు

- మంత్రి పెద్దిరెడ్డి ఎదుట అసమ్మతి నేతల నిరసన గళం

ప్రజాశక్తి- మడకశిర, హిందూపురం

'జగనన్న ముద్దు- మా ఎమ్మెల్యే వద్దు' అంటూ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఎదుట వైసిపి అసమ్మతి నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేశారు. పార్టీకి నష్టం కలిగించేలా ఎవరూ వ్యవహరించవద్దని మంత్రి సూచించారు. రాయలసీమ వైసిపి నియోజకవర్గ సమీక్షలో భాగంగా గురువారం సత్యసాయి జిల్లా మడకశిర నియోజకవర్గంలో మంత్రి పర్యటించారు. మడకశిర పట్టణంలోని సమీక్షా సమావేశానికి ఆయన వెళ్తుండగా మార్గ మధ్యంలో కల్లుమరి గ్రామం జాతీయ రహదారి వద్ద మడకశిర వైసిపి అసమ్మతి నేతలు మాజీ మంత్రి నర్సేగౌడ్, మాజీ ఎమ్మెల్యే వైటి.ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ ఛైర్మన్ నళిని రంగేగౌడ్, సంగీత నృత్య అకాడమీ డైరెక్టర్ శాలిని సుధాకర్‌తో పాటు పలువురు నియోజకవర్గ ప్రజాప్రతినిధులు నిరసన తెలిపారు. 'జగనన్న ముద్దు- మా ఎమ్మెల్యే (మడకశిర ఎమ్మెల్యే తిప్పేస్వామి) వద్దు' అంటూ నినాదాలు చేశారు. ఏవైనా ఉంటే కూర్చుని మాట్లాడుకుందామని వారికి మంత్రి సూచించారు. 'మీ ఎమ్మెల్యే పని అయి పోయింది.. వదిలేయండి' అంటూ అసమ్మతి నేతలకు మంత్రి ఓ సంకేతం ఇచ్చారు.

చిల్లర చేష్టలు చేస్తే సహించం

వైసిపి నాయకులు, కార్యకర్తలు ఎవరైనా పార్టీకి నష్టం చేకూర్చేలా చిల్లర చేష్టలు చేస్తే సహించేది లేదని, అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హెచ్చరించారు. హిందూపురం నియోజకవర్గ సమీక్షా సమావేశంలో ఆయన పై వ్యాఖ్యలు చేశారు. ప్రతి ఒక్కరూ పార్టీ విధానాలకు కట్టుబడి పని చేయాలన్నారు. అసమ్మతి పేరుతో పార్టీకి నష్టం చేస్తే సహించేది లేదన్నారు.

దిక్కుతోచని ఆక్వా రైతులు

- మేత, ప్రొబయోటిక్స్ అరువు ఇవ్వని వ్యాపారులు
- సాగు కొనసాగించలేక అవస్థలు
- కౌంట్ తక్కువగా ఉండగానే అమ్మకాలు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి


డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తంలో ఆక్వా చెరువులు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఆక్వా రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. గతంలో ఏటా పది లక్షల మెట్రిక్ టన్నులపైగా దిగుబడి సాగిస్తూ విదేశీ మార్కెట్లో సత్తా చాటిన ఘనచరిత క్రమంగా మసకబారుతోంది. ప్రకృతి వైపరీత్యాలు, ప్రభుత్వ ప్రోత్సాహలేమి, రొయ్యల మేత ధరల పెరుగుదల, మార్కెట్‌లో ధర లేకపోవడం వంటి వరుస పరిణామాలతో ఆక్వా రంగం నష్టాల బాట పట్టింది. మేత, ప్రొ బయాటిక్స్ అరువు ఇచ్చేది లేదని రైతులకు వ్యాపారులు ముఖం చాటేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 53,263 ఎకరాల్లో రొయ్యల సాగు జరుగుతోంది.

20 వేల మందికిపైగా రైతులు ప్రత్యక్షంగా, ప్రాసెసింగ్ యూనిట్లు, ఎక్స్‌పోర్టర్స్, చిరు వ్యాపారులు మరో 50 వేల మందికిపైగా ఈ రంగంపై ఆధారపడి జీవనోపాధి పొందుతున్నారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 13,500 మంది రైతులు 34 వేల ఎకరాల్లో, కాకినాడ జిల్లాలో 6,537 మంది రైతులు 16,343 ఎకరాల్లో, తూర్పుగోదావరి జిల్లాలో 577 మంది రైతులు 2,920 ఎకరాల్లో ఆక్వా సాగు చేస్తున్నారు. అనధికారికంగా మరో పది వేల ఎకరాల్లో సాగు జరుగుతోంది. రొయ్య పిల్లలు, విద్యుత్తు, డీజిల్ వంటి వాటిని రైతులు ముందుగానే నగదు చెల్లించి కొనుగోలు చేస్తుంటారు. రొయ్యల మేత, ప్రొ బయాటిక్స్, ఇతర మందులను దుకాణాల్లో అరువుకు తెచ్చుకుంటారు. పంట అమ్మిన తరువాత డబ్బులు చెల్లిస్తారు. ప్రస్తుతం ఆక్వా రంగం సంక్షోభంలో ఉండడంతో మేత దుకాణాల వ్యాపారులు ఈ నెల ఒకటి నుంచి అరువు ఇవ్వడం నిలిపేశారు. రాజకీయ పెద్దలు, పెద్ద రైతులకు మాత్రమే అరువు ఇస్తున్నాయి. చిన్న రైతులు పెట్టుబడి పెట్టే స్థోమత లేక సాగుకు స్వస్తి చెప్పేందుకు సిద్ధమవుతున్నారు. గడిచిన నెల రోజుల్లో పది వేల ఎకరాల్లో పంటను మధ్యలోనే అమ్ముకున్నట్టు సమాచారం. కొంతమంది రైతులు ఉన్న పంటతోనే సరిపెట్టుకుని, మళ్లీ పంటకు రొయ్య పిల్లలను వేయడం లేదు. ఏటా ఈ సీజన్‌లో సీడ్ కోసం పెద్ద ఎత్తున ఆర్డర్లు వచ్చేవని, రైతులు సాగుకు ముందుకు రాకపోవటంతో అమ్మకాలు మందగించాయని హేచరీల నిర్వాహకులు చెబుతున్నారు.

వంద కౌంట్ రూ.230 ప్రకటనలకే పరిమితం

గతంలో వంద కౌంట్ రొయ్యల ధర కిలో రూ.220 వరకూ పలికేది. ప్రస్తుతం రూ.150 నుంచి రూ.160 ఉంది. ప్రభుత్వం ఇటీవల మంత్రులతో కమిటీ వేసి వంద కౌంట్‌కు కిలో ఒక్కంటికీ రూ.230 ధర చెల్లించాలని నిర్ణయించింది.

వ్యాపారులు, ప్రాసెసింగ్ యూనిట్లు సిండికేట్‌గా మారడంతో ఈ ధర అమలు కావట్లేదు. ఎకరా రొయ్యల సాగుకు రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షల వరకూ ఖర్చవుతోంది. గత నెల రోజులుగా రొయ్యలు కొనేందుకు ఎగుమతిదారులు ముందుకు రావట్లేదని, వ్యాపారులు అడిగిన ధరకు అమ్ముకోవాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకుని ఆదుకోవాలని, లేనిపక్షంలో ఆక్వా రంగం భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం చొరవ చూపాలి

ప్రభుత్వ నిర్లక్ష్యం ఫలితంగా రొయ్యల రైతులు పూర్తిగా నష్టపోతున్నారు. వంద శాతం ఫారిన్ ఎక్స్ఛేంజ్‌కి అవకాశం ఉన్న ఆక్వా రంగం అభివృద్ధికి చొరవ చూపాలి. వంద కౌంట్ కేజీకి పెట్టుబడి ఖర్చు రూ.300 అవుతోంది. మార్కెట్ ధర రూ.150 మించడం లేదు. ఎగుమతిదారుల తీరుపై ప్రత్యేక పర్యవేక్షణ అవసరం. ఫీడ్ ధరలను అదుపు చేయాలి. మంచి సీడ్ అందించే విధంగా చర్యలు చేపట్టాలి. కరోనా వైరస్ విజృంభణ అనంతరం నెలకొన్న పరిస్థితుల నుంచి ఇప్పటికీ ఆక్వా రైతులు కోలుకోలేదు.

రావు చిన్నారావు, ఆక్వా రైతు, ఉప్పలగుప్తం

మార్కెట్లకు ఫెడ్ దెబ్బ


సెన్సెక్స్ 878 పాయింట్ల పతనం



ముంబయి : అమెరికా ఫెడరల్ రిజర్వ్ మరోమారు వడ్డీ రేట్లను పెంచడంతో భారత మార్కెట్లు భయాందోళనకు గురైయ్యాయి. గురువారం ఉదయం నుంచి తుది వరకు నష్టాల్లోనే సాగాయి. తుదకు బిఎస్‌ఇ సెన్సెక్స్ 878 పాయింట్లు పతనమై 61,800కు పడిపోయింది. ఇదే బాటలో ఎన్‌ఎస్‌ఇ నిఫ్టీ 245 పాయింట్ల నష్టంతో 18,414 వద్ద ముగిసింది. ఒక్క పూటలోనే మదుపర్ల సంపద దాదాపు రూ.3 లక్షల కోట్లు ఆవిరయ్యింది. అన్ని రంగాల సూచీలు ప్రతికూలతను ఎదుర్కొన్నాయి. ఐటి, మీడియా, పిఎస్‌యు షేర్లు అధికంగా 2 శాతం మేర కోల్పోయాయి. వరుసగా నాలుగు భేటీల్లో 0.75 శాతం వడ్డీ రేట్లను పెంచిన ఫెడ్ తాజాగా మరోమారు 0.5 శాతం పెంచడంతో పాలసీ రేటు 4.25 శాతం-4.5 శాతానికి చేరింది. వరుస పెంపునకు తోడు 2023 చివరిలోనూ మరోసారి 0.75 శాతం పెంపు ఉండొచ్చన్న సంకేతాలు మదుపర్లను ఆందోళనకు గురి చేశాయి. ఫెడ్ వడ్డీ రేట్ల పెంపునతో భారత మార్కెట్ల నుంచి ఎఫ్‌ఐఐలు భారీగా తరలిపోయాయని నిపుణులు పేర్కొంటున్నారు.

నీరవ్ మోడికి మూసుకున్న దారులు

- బ్రిటన్ కోర్టులో చుక్కెదురు



లండన్ : పంజాబ్ నేషనల్ బ్యాంక్‌ను వేల కోట్లకు మోసం చేసి బ్రిటన్ పారిపోయిన నీరవ్ మోడీకి అక్కడ న్యాయ పరంగా అన్ని దారులు మూసుకుపోయాయి. తనను భారత్‌కు అప్పగించకూడదని నీరవ్ అక్కడి సుప్రీంకోర్టును సంప్రదించడానికి అవకాశం ఇవ్వాలనే అప్పీల్‌ను హైకోర్టు నిరాకరించింది. దీంతో ఆ ఆర్థిక నేరగాన్ని భారత్‌కు అప్పగించే ప్రక్రియ సులభం కానుంది. అయితే.. భారత్‌కు అప్పగించే అంశంలో యూరప్ సమాఖ్య మానవ హక్కుల కోర్టును నీరవ్ ఆశ్రయించడానికి వీలుంది. గుజరాత్ కేంద్రంగా వజ్రాల వ్యాపారం చేసిన నీరవ్ మోడీ పిఎన్‌బికి దాదాపుగా రూ.12వేల కోట్లకు మోసం చేశారు. టెక్నికల్‌గా, అక్రమంగా దోచేసి 2018లో పారిపోగా.. 2019లో లండన్‌లో అరెస్ట్ అయి ప్రస్తుతం కటకటాల్లో ఉన్నారు.

బిఎస్‌వి చేతికి ఫస్ట్‌లైన్ ఫార్మాస్యూటికల్స్

న్యూఢిల్లీ : మలేషియాలో మహిళల వైద్యం, సంతాన సేవలు అందించే ఫస్ట్‌లైన్ ఫార్మాస్యూటికల్స్ ఎస్‌డిఎన్‌ను భారత్ సీరమ్స్ అండ్ వాక్సినెస్ లిమిటెడ్ (బిఎస్‌వి) స్వాధీనం చేసుకున్నట్లు ప్రకటించింది. బిఎస్‌వికి చెందిన జెనోమిక్స్ ఎస్‌డిఎన్‌ను కూడా సొంతం చేసుకున్నట్లు పేర్కొంది. ఫస్ట్‌లైన్ ఫార్మాను 2007లో ఫెర్టిలిటీ ట్రీట్‌మెంట్ కోసం, మెడికల్ పరికరాలను సరఫరా చేయడానికి జెనోమిక్స్‌ను 2016లో ఏర్పాటు చేసింది. కాగా.. వీటిని ఎంత మొత్తానికి స్వాధీనం చేసుకున్నది బిఎస్‌వి వెల్లడించలేదు.

కొత్త ఏడాదిలో హ్యుందాయ్ కార్లు ప్రియం

న్యూఢిల్లీ : హ్యుందాయ్ మోటార్ ఇండియా వచ్చే కొత్త ఏడాదిలో కార్ల ధరలను పెంచనున్నట్లు ప్రకటించింది. ఉత్పత్తి వ్యయం పెరగడంతో అన్ని మోడళ్లపై ఈ ప్రభావం ఉంటుందని పేర్కొంది. కాగా.

ఎంత శాతం పెంచేది ఆ కంపెనీ వెల్లడించలేదు. ఇప్పటికే మారుతి సుజుకి, కియా, టాటా మోటార్స్ తదితర కంపెనీలు ధరల పెంపును ప్రకటించిన విషయం తెలిసిందే.

సంపాదకీయం


ప్రజాస్వామ్యానికి ప్రమాదం

బీమా కొరెగావ్ కేసులో ఒకొక్కటిగా వెలుగులోకి వస్తున్న అంశాలు తీవ్ర దిగ్భ్రాంతిని కలిగిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వ బరితెగింపు తనానికి, దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తున్న తీరుకు ఈ కేసు నిలువెత్తు నిదర్శనం. ఈ కేసులో భాగంగా దేశద్రోహ ఆరోపణలతో జైలులోనే మగ్గి కనీస సౌకర్యాల తిరస్కరణకు గురై కటకటాల వెనుకే మృతి చెందిన 80 సంవత్సరాల వృద్ధుడు స్టాన్‌స్వామిని నేరస్తుడుగా నిరూపించేందుకు జరిగిన కుట్ర తాజాగా బట్టబయలైంది. ప్రఖ్యాతి చెందిన అమెరికా ఫోరెన్సిక్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ ఆర్సెనల్ వెల్లడించిన వివరాలను పరిశీలిస్తే దేశంలో ప్రజాస్వామ్యానికి, పౌరహక్కులకు ఏ స్థాయిలో ముప్పు పొంచి ఉందో ఇట్టే అర్థమవుతుంది. ఇటువంటి నివేదిక వెల్లడి కావడం ఇదే మొదటిసారి కాదు. గతంలో కూడా ఇటువంటి నివేదికలు వెల్లడయ్యాయి. అప్పట్లో కేంద్ర ప్రభుత్వం పెదవి విప్పకపోగా వేధింపు చర్యలను, ఈ కేసులో నిందితులపై నిర్బంధాన్ని మరింత తీవ్రం చేసింది. తాజాగా వెల్లడైన ఆర్సెనల్ నివేదిక ఐదవది కాగా, మరింత స్పష్టంగా కుట్ర సాగిన తీరును, తాము లక్ష్యంగా ఎంచుకున్న వారిపట్ల దర్యాప్తు సంస్థల వ్యవహారశైలిని బట్టబయలు చేసింది. ఈ వ్యవహారంపై చర్చించాలని, సుప్రీంకోర్టు పర్యవేక్షణలో న్యాయవిచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఎంపి ఎ.ఎం అరిఫ్ లోక్‌సభలో వాయిదా తీర్మానాన్ని ప్రతిపాదించారు.

2017 నుండి 2019 మధ్య కాలంలో స్టాన్‌స్వామి ఉపయోగించిన కంప్యూటర్లలో హ్యాకర్లు 40 ఫైళ్లను చేర్చారని ఆర్సెనల్ నివేదిక స్పష్టం చేసింది. ఆ ఫైళ్లను ఆయన చూడను కూడా లేదని పేర్కొంది. ఇంకా ఆందోళన కలిగించే అంశమేమిటంటే పూణే పోలీసులు స్టాన్‌స్వామిని అరెస్ట్ చేయడానికి ఒక్కరోజు ముందు హ్యాకర్లు తమ చొరబాటుకు సంబంధించిన ఆధారాలను తొలగించారు. అంటే అర్ధమేమిటి? పోలీసులు అరెస్ట్ చేస్తున్న విషయం వారికి ముందుగా తెలుసనే కదా! హ్యాకర్లు దొంగచాటుగా పెట్టిన ఫైళ్ళే స్టాన్‌స్వామిపై నేరారోపణకు ప్రధాన సాక్ష్యాధారాలుగా జాతీయ దర్యాప్తు సంస్థ చూపుతోంది. వాటిని అడ్డంపెట్టే 80 ఏళ్ల వయసులో ఆయనకు బెయిల్ మంజూరుకాకుండా, కనీస సౌకర్యాలు ఇవ్వకుండా అడ్డుకుంది. తన అనారోగ్యాన్ని, వృద్ధాప్యం కారణంగా ఏర్పడిన నిస్సహాయతను ఆయన పదేపదే వ్యక్తం చేసినా కనికరం చూపలేదు. చివరకు కస్టడీలోనే ఆయన తుదిశ్వాస విడవాల్సిరావడం ఎంత బాధాకరం? ఇది సర్కారీ హత్య గాక మరేమిటి? ఈ కేసులో 16 మందిని అరెస్ట్ చేయగా, వారిలో ముగ్గురికి బెయిల్ లభించింది. ఒకరు హౌస్ అరెస్ట్‌లో ఉన్నారు. మరొకరు మృతి చెందారు. మిగిలిన వారు జైలులోనే మగ్గుతున్నారు. మరోవైపు స్టాన్‌స్వామితో పాటు ఇతర నిందితులపై పోలీసులు చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని, కుట్రపూరితంగా వారి కంప్యూటర్లలోచొరబడి నకిలీ పత్రాలను చొప్పించారన్న సాక్ష్యాధారాలు ఒకదాని తరువాత ఒకటిగా బయటకు వస్తున్నాయి.

నేరస్తుడు శిక్షపడకుండా తప్పించుకోవచ్చుగానీ, నిరపరాధికి పొరపాటున కూడా శిక్షపడకూడదన్నది మన న్యాయశాస్త్ర సూత్రం. కానీ, బీమా కొరెగావ్ కేసులో జరుగుతున్నదేమిటి? హ్యాకర్లు పెట్టిన నకిలీ పత్రాలు, మెయిళ్లను ఆధారంగా చేసుకుని, మేధావులు, న్యాయవాదులు, రచయితలు.కవులు, కళాకారులపై దేశద్రోహ ముద్ర వేశారు. అర్బన్ నక్సల్స్ అంటూ దుర్భాషలాడారు. ఇప్పుడు అవి నకిలీవని ఒకటికి ఐదు ఫోరెన్సిక్ సంస్థలు తేల్చిన తరువాతకూడా కేంద్ర ప్రభుత్వ వైఖరిలో మార్పు రావడం లేదు. ప్రజాస్వామ్యం పట్ల, పౌరహక్కుల పట్ల ఏమాత్రం శ్రద్ధ ఉన్న ప్రభుత్వమైనా ఈ నివేదికలను సీరియస్‌గా తీసుకుంటుంది. నిందితులకు తక్షణం బెయిల్ మంజూరు చేసి, న్యాయవిచారణకు ఆదేశిస్తుంది. ఇది ప్రజా ప్రభుత్వాల కనీస బాధ్యత. కానీ, మోడీ ప్రభుత్వం దీనికి భిన్నంగా వ్యవహరిస్తోంది. రేపు ఇదే పరిస్థితి ఇతరులకు కూడా ఏర్పడవచ్చు. ప్రతిపక్షపార్టీలను, నేతల పరికరాలను హ్యాక్ చేసి నకిలీపత్రాలను చొప్పించి వేధించవచ్చు. ఇదే జరిగితే ప్రజాస్వామ్యమే ప్రమాదంలో పడుతుంది. జి-20 గ్రూపునకు నాయకత్వం వహిస్తున్నామని ఒకవైపు గొప్పలు చెప్పుకుంటూ మరోవైపు మేడిపండు చందంగా ప్రజాస్వామ్యాన్ని మార్చడం దుర్మార్గం. ప్రజాస్వామ్యం పట్ల కేంద్ర ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా ఈ కేసులోని నిందితులందరిని తక్షణం విడుదల చేయాలి. వాస్తవాలను ప్రజలకు వివరించాలి. దీనికోసం ప్రజలు, ప్రజాస్వామ్య వాదులు ఉద్యమించాలి.

మంచి మాట



మానవ చరిత్ర గతిని నిర్ణయించేవి ఆర్థిక పరిస్థితులే కానీ రాజకీయ, మత, సాంస్కృతిక పరిస్థితులు కావు

- కారల్ మార్క్స్

పూర్తి స్థాయి పెన్షన్ ఉద్యోగుల హక్కు

విశ్లేషణ



ఎం.వి.ఎస్. శర్మ

"పాత పెన్షన్ స్కీమ్ ను పునరుద్ధరించే ప్రస్తావన ఏదీ మా వద్ద లేదు"- లోక్‌సభలో స్పష్టం చేసిన ఆర్థిక మంత్రిత్వ శాఖ. కేంద్ర ప్రభుత్వం దగ్గర పాత పెన్షన్ స్కీమును పునరుద్ధరించే ప్రతిపాదన ఏదీ లేదని ఆర్థిక మంత్రిత్వ శాఖ లోక్‌సభ లో డిసెంబర్ 12న రాతపూర్వకంగా స్పష్టం చేసింది. లోక్‌సభ సభ్యుడు అసదుద్దీన్ ఒవైసీ అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ, ఒకసారి కొత్త పెన్షన్ స్కీములో ప్రవేశించాక రాష్ట్ర ప్రభుత్వాలను మళ్లీ పాత పెన్షన్ స్కీములోకి మారడానికి అనుమతించే ప్రసక్తి కూడా లేదని తేల్చి చెప్పింది. "అమ్మ పెట్టా పెట్టదు, అడుక్కు తినానివ్వదు" అన్న చందాన మోడీ ప్రభుత్వం వ్యవహరిస్తోంది.

"1. ఏవైనా రాష్ట్ర ప్రభుత్వాలు తమ ఉద్యోగులకు పాత పెన్షన్ స్కీమును తిరిగి ప్రారంభించాయా ? అయితే ఆ వివరాలను తెలియజేయండి.

2. పాత పెన్షన్ స్కీమును మళ్లీ ప్రారంభించడానికిగాను ఏవైనా రాష్ట్ర ప్రభుత్వాలు తాము ఇంతవరకూ కొత్త పెన్షన్ స్కీము కింద కేంద్రానికి చెల్లించిన సొమ్మును తిరిగి వాపసు ఇవ్వమని కోరాయా ?

3. ఒకవేళ ఆ విధంగా కోరినట్లైతే ఆ వివరాలను, అందుకు కేంద్ర ప్రభుత్వపు ప్రతిస్పందనను తెలియజేయండి.

4. పాత పెన్షన్ స్కీమును తిరిగి ప్రారంభించదలచిన రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్రం కొత్త పెన్షన్ స్కీము కింద ఆ రాష్ట్రాలు తనకు చెల్లించిన సొమ్మును వాపసు ఇచ్చే విషయంలో కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని తెలియజేయగలరు

5.సమీప భవిష్యత్తులో కేంద్రం కొత్త పెన్షన్ స్కీము కింద జమ అయిన సొమ్మును వెనక్కి ఇచ్చే ప్రతిపాదన ఏదైనా కేంద్రం వద్ద పరిశీలనలో ఉందా ? ఉంటే ఆ వివరాలను తెలియజేయండి."

- ఇది అసదుద్దీన్ ఒవైసీ కేంద్ర ఆర్థిక మంత్రిని అడిగిన ప్రశ్న. దీనికి ఆర్థిక శాఖ సహాయ మంత్రి భగవత్ కరాడ్ ఈ విధంగా లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు.

'-రాజస్తాన్, చత్తీస్‌ఘడ్, జార్ఖండ్ రాష్ట్రాల ప్రభుత్వాలు తమ ఉద్యోగులకు పాత పెన్షన్ స్కీమును పునరుద్ధరించాలని నిర్ణయించినట్టు కేంద్ర ప్రభుత్వానికి, పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ (పిఎఫ్‌ఆర్‌డిఎ)కి తెలియజేశాయి.

-18-11-22 న పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం కొత్త పెన్షన్ స్కీము వర్తిస్తున్న తన ఉద్యోగులకు పాత పెన్షన్ స్కీమును వర్తింపజేస్తూ నోటిఫికేషన్ జారీ చేసింది.

-రాజస్తాన్, చత్తీస్‌ఘడ్, జార్ఖండ్ రాష్ట్రాల ప్రభుత్వాలు తాము కొత్త పెన్షన్ స్కీము కింద కేంద్ర పిఎఫ్‌ఆర్‌డిఎకు చెల్లించిన మొత్తాన్ని వాపసు ఇవ్వవలసిందిగా కోరాయి. ఇంతవరకూ అటువంటి విజ్ఞాపన ఏదీ పంజాబ్ నుండి రాలేదు.

"రాజస్తాన్, చత్తీస్‌ఘడ్, జార్ఖండ్ రాష్ట్ర ప్రభుత్వాల విజ్ఞప్తికి స్పందిస్తూ పిఎఫ్‌ఆర్‌డిఎ 2013 పిఎఫ్‌ఆర్‌డిఎ చట్టం ప్రకారం గాని, పిఎఫ్‌ఆర్‌డిఎ (కొత్త పెన్షన్ స్కీము నుండి నిష్క్రమణలు, మరియు ఉపసంహరణలు) నిబంధనలు, 2015 ప్రకారంగాని ఒకసారి కేంద్రం వద్ద జమ చేసిన పెన్షన్ నిధులను వెనక్కి ఇచ్చే అవకాశం ఏదీ లేదని తెలియజేసింది.పాత పెన్షన్ స్కీమును పునరుద్ధరించే ప్రతిపాదన ఏదీ కేంద్రం పరిశీలనలో లేదు."

కొత్త పెన్షన్ స్కీమును ప్రవేశపెడుతూ చట్టాన్ని 2003లో తీసుకువచ్చిందీ అప్పటి బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఏ ప్రభుత్వమే. ఒకసారి ఆ స్కీములో తల దూర్చాక మళ్ళీ వెనక్కిపోలేని విధంగా నిబంధనలు 2015లో జారీ చేసిందీ బిజెపి ప్రభుత్వమే. ఇప్పుడు ఉద్యోగులంతా ముక్త కంఠంతో మాకీ కొత్త స్కీము వద్దు మొర్రో అంటున్నా మొండిగా వ్యవహరిస్తున్నదీ మోడీ ప్రభుత్వమే. కొత్త పెన్షన్ స్కీము రూపంలో కేంద్రానికి ప్రతీ నెలా వేల కోట్ల రూపాయలు వచ్చి పడుతున్నాయి. ఆ సొమ్మునంతటినీ స్టాక్ మార్కెట్లో జూదానికి వాడుతోంది పిఎఫ్‌ఆర్‌డిఎ. తద్వారా బడా కార్పొరేట్లకు ఉద్యోగుల కష్టార్జితాన్ని దోచిపెడుతోంది. బిజెపి యేతర రాష్ట్ర ప్రభుత్వాలు తాము ఇంతవరకూ చెల్లించిన మొత్తాన్ని తిరిగి వెనక్కి ఇవ్వవలసిందిగా కోరుతున్నా, ఇచ్చేది లేదని ఇప్పుడు మొండిగా నిరాకరిస్తోంది.



విశాఖలో ఇటీవల జరిగిన ప్రభుత్వ పెన్షనర్ల ధర్నా (ఫైల్)

> " పెన్షన్ అనేది యజమాని తన ఇష్టాన్ని బట్టి చెల్లించేది కాదు. దయా దాక్షిణ్యాలను బట్టి చేసే దానమూ కాదు. అది ఒక సామాజిక సంక్షేమ చర్య. తమ తమ యుక్త వయస్సులో అవిశ్రాంతంగా యజమానులకు సేవలందించిన ఉద్యోగులకు సామాజిక-ఆర్థిక న్యాయం చేయడానికి తీసుకున్న చర్య పెన్షన్ విధానం. వృద్ధాప్యంలో వారిని పట్టించుకోకుండా వదిలేయబోమన్న హామీ మేరకే ఆ ఉద్యోగులు ఆ విధంగా సేవలందించారు. "ఇది ఆనాడు సుప్రీం కోర్టు తీర్పులో పేర్కొన్న కీలకాంశం. ఉద్యోగ విరమణ అయిన తేదీలు వేరైనప్పటికీ, ఒకే విధమైన సర్వీసును (ఒకే కేడర్‌లో) ఒకే కాలం (సమాన సర్వీసు) అందించిన ఉద్యోగులకు సమానమైన పెన్షన్ ఇవ్వవలసిందేనని ఆ తీర్పులో సుప్రీంకోర్టు చెప్పింది

1956లో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు పెన్షన్ స్కీమును మొదట ప్రవేశపెట్టారు. ఉద్యోగులు తమ తమ జీవితాల్లోని అతి ముఖ్యమైన కాలాన్ని ప్రభుత్వ సేవకు అంకితం చేసినందున ఉద్యోగ విరమణ అనంతరం వారి జీవితాలు సవ్యంగా సాగిపోయేలా చూడడం ప్రభుత్వ బాధ్యత అవుతుందని అప్పటి ప్రభుత్వం అంగీకరించింది. అందుకే ప్రభుత్వానికి వచ్చే ఆదాయం నుండే ఉద్యోగులకు పెన్షన్‌ను చెల్లించడానికి ఏర్పాటు చేసింది. అనంతర కాలంలో రాష్ట్ర ప్రభుత్వాలు కూడా అదే మార్గాన్ని అనుసరించాయి. 1982లో సుప్రీంకోర్టు అతి ముఖ్యమైన తీర్పును వెలువరించింది. "నకారా జడ్జిమెంట్" గా ప్రఖ్యాతి చెందిన ఆ తీర్పు 17-12-1982 న వెలువడింది. ఆ తర్వాత కాలంలో ఆ తీర్పు వెలువడిన రోజును అఖిలభారత పెన్షనర్ల దినంగా పాటించడం ఆనవాయితీగా వస్తోంది.

" పెన్షన్ అనేది యజమాని తన ఇష్టాన్ని బట్టి చెల్లించేది కాదు. దయా దాక్షిణ్యాలను బట్టి చేసే దానమూ కాదు. అది ఒక సామాజిక సంక్షేమ చర్య. తమ తమ యుక్త వయస్సులో అవిశ్రాంతంగా యజమానులకు సేవలందించిన ఉద్యోగులకు సామాజిక-ఆర్థిక న్యాయం చేయడానికి తీసుకున్న చర్య పెన్షన్ విధానం. వృద్ధాప్యంలో వారిని పట్టించుకోకుండా వదిలేయబోమన్న హామీ మేరకే ఆ ఉద్యోగులు ఆ విధంగా సేవలందించారు. "ఇది ఆనాడు సుప్రీం కోర్టు తీర్పులో పేర్కొన్న కీలకాంశం. ఉద్యోగ విరమణ అయిన తేదీలు వేరైనప్పటికీ, ఒకే విధమైన సర్వీసును (ఒకే కేడర్‌లో) ఒకే కాలం (సమాన సర్వీసు) అందించిన ఉద్యోగులకు సమానమైన పెన్షన్ ఇవ్వవలసిందేనని ఆ తీర్పులో సుప్రీంకోర్టు చెప్పింది.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతోబాటు తమకూ పెన్షన్ వర్తింపజేయాలని ఆ తర్వాత కాలంలో ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులు ఉద్యమాలు చేపట్టారు. నయా ఉదారవాద విధానాలు అమలు కావడం మొదలయ్యాక ఉద్యోగులు, కార్మికుల హక్కులమీద దాడులు పలు రూపాల్లో ప్రారంభమయ్యాయి. వాటిలో భాగంగానే పెన్షన్ మీద దాడి కూడా మొదలైంది. పెన్షన్ డిమాండ్ అందరినీ ఏకం చేసే అవకాశం ఉంది. అది నయా ఉదారవాదానికి సుతరామూ నప్పదు. అందుకే రకరకాలుగా ఉద్యోగులను విడగొట్టడానికి పూనుకుంది. అందులో భాగంగానే ఇపిఎస్-1995 వచ్చింది. 1995 కు ముందు చేసిన సర్వీసును లెక్కలోకి తీసుకోకుండా అప్పటినుంచే లెక్కించడం, ఉద్యోగుల జీతాలనుండి కొంత సొమ్మును ఇపిఎఫ్ నిమిత్తం మినహాయించడం, జమ అయిన సొమ్ము నుండే పెన్షన్ చెల్లించడం దీనితోనే మొదలైంది. యజమానిదే పూర్తి బాధ్యత అని నకారా జడ్జిమెంట్ చెప్తుంటే, కార్మికులే తమ భవిష్యత్తు పెన్షన్ నిమిత్తం చెల్లించాలి అని ఇపిఎఫ్ స్కీము అంటుంది. ప్రభుత్వ నిధులనుండే నేరుగా పెన్షన్ చెల్లించాలని సుప్రీం తీర్పు నిర్దేశించింది. కానీ పెన్షన్ చెల్లించడం కోసం ఒక ప్రత్యేక నిధిని ఏర్పాటు చేసి ఆ నిధిలో సొమ్ము ఉంటేనే చెల్లించగలుగుతాం అని ఇపిఎఫ్ స్కీము ద్వారా ప్రభుత్వం సుప్రీం తీర్పును పక్కన బెట్టింది. వాజపేయి ప్రభుత్వ హయాంలో బండారు దత్తాత్రేయ కార్మిక మంత్రిగా ఉన్న కాలంలో ఇపిఎఫ్ కనీస మొత్తాన్ని నెలకు రు. 6000లు చేస్తామని ప్రకటించారు. సన్మానాలు కూడా అందుకున్నారు. అది జరిగి పాతికేళ్లయింది. ఇప్పటికీ కనీస పెన్షన్ ఇపిఎఫ్‌లో రు. 1000 గానే కొనసాగుతోంది.

ఇక 2003లో తెచ్చిన కొత్త పెన్షన్ స్కీము సంగతి చెప్పనక్కరలేదు. 2004 తర్వాత సర్వీసులో చేరిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వోద్యోగులకు, పెన్షన్ స్కీములు అమలులో ఉన్న బ్యాంకులు, ఇన్సూరెన్స్, టెలికం తదితర రంగాల ఉద్యోగులకు సైతం ఈ కొత్త పెన్షన్ స్కీము వర్తిస్తుంది. ఈ స్కీము ద్వారా ఉద్యోగుల జీతాలనుండి మినహాయించే సొమ్ము యావత్తూ పిఎఫ్‌ఆర్‌డిఎ వద్దకు చేరుతుంది. అక్కడినుండి స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెడతారు. ఆ స్టాక్ మార్కెట్ జూదం సంగతి అందరికీ తెలిసినదే. అంటే 66 సంవత్సరాల క్రితం ఒక హక్కుగా మొదలైన పెన్షన్ ఇప్పుడు ఉద్యోగులే తమ సర్వీసు కాలంలో కొనుక్కోవలసిన ఒక సరుకుగా మారిపోయిందన్నమాట. పైగా అది కూడా స్టాక్‌మార్కెట్ జూదంలో కార్పొరేట్ల మాయలో చిక్కుకుపోయింది. అక్కడినుండి వెనక్కి మళ్లించాలని, పెన్షన్‌ను తిరిగి తమ హక్కుగా పరిగణించాలని ఉద్యోగులంతా ఆందోళనలు చేస్తున్నారు. కానీ మోడీ ప్రభుత్వం మాత్రం 'తగ్గేదేలే' అన్నట్టు వ్యవహరిస్తోంది. మన రాష్ట్రంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు సిపిఎస్ విధానం రద్దు చేయాలని చాలా కాలం నుండీ ఆందోళనలు సాగిస్తున్నారు. జగన్ ప్రభుత్వం ఈ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ స్కీమును అందరికీ వర్తింపజేస్తానని హామీ ఇచ్చింది. కానీ ఇప్పుడు మాట మార్చింది. పాత పెన్షన్ విధానాన్ని తీసుకురావడం సాధ్యం కాదని స్పష్టంగా ప్రకటించడం బట్టి ఈ విషయాన్ని నిర్ధారించవచ్చు. ఉద్యోగులు, ఉపాధ్యాయులను మోసగించడానికే ఇప్పుడు జిపిఎస్ అంటూ కొత్త పల్లవిని ఎత్తుకుంది. ఐతే, దీనిని అన్ని సంఘాలూ ముక్త కంఠంతో తిరస్కరించాయి. తాజాగా కేంద్ర ప్రభుత్వం రాతపూర్వకంగా ఇచ్చిన సమాధానం బట్టి కొత్త పెన్షన్ స్కీము (లేదా సిపిఎస్) వెనక మూలవిరాట్టులు ఎవరన్నది స్పష్టమవుతోంది. ఒకసారి ప్రవేశపెట్టాక పెన్షన్ నిధులను రాష్ట్ర ప్రభుత్వాలు కోరినప్పటికీ వెనక్కి ఇవ్వబోము అని కేంద్రం కుండబద్దలుగొట్టింది. ఇది ఉద్యోగుల హక్కు మీద దాడి మాత్రమే కాదు, రాష్ట్ర ప్రభుత్వాల హక్కులమీద కూడా దాడిగా పరిగణించాలి. ఐతే మోడీకి తందాన పాడే జగన్ ప్రభుత్వం ఈ విషయంలో నోరు విప్పుతుందని ఆశించగలమా ?

ఏదేమైనా ఒక విషయం స్పష్టం. నయా ఉదారవాద విధానాల అమలు పర్యవసానంగా ఉద్యోగుల పెన్షన్ హక్కు కాస్తా ఉద్యోగులు తమ కష్టార్జితాన్నుంచి కొనుక్కునే సరుకుగా దిగజారిపోయింది. ఆ సరుకూ గ్యారంటీగా దొరుకుతుందని చెప్పలేని స్థితి వచ్చింది. అందుచేత దేశవ్యాప్తంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగులు, ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులు, పెన్షనర్లు అందరూ ఏకమై పోరాడాల్సిన తరుణం వచ్చింది. ఈ' పెన్షనర్స్ డే' నాడు అందరూ ఆ ఐక్య పోరాటానికి సమాయత్తమవుదాం.

(డిసెంబర్ 17 పెన్షనర్ల దినం సందర్భంగా)

వ్యాసకర్త : శాసనమండలి పూర్వ సభ్యులు

★

ఆరోగ్యకరమైన ఆలోచనలతోనే విలువల పరిరక్షణ

కామన్‌సెన్స్



డాక్టర్ దేవరాజు మహారాజు

ప్రపంచ ప్రఖ్యాత రచయిత మార్క్‌ట్విన్ ఒక చిన్న ప్రయోగం చేసి చూడమన్నాడు. ఒక గాజు సీసాలో కొన్ని నల్ల చీమల్ని, మరికొన్ని ఎర్ర చీమల్ని వేసి పరిశీలించమన్నాడు. అవి వేటికవే నింపాదిగా తిరుగుతుంటాయి. కొంత సేపటికి ఆ గాజు సీసాను పైకీ కిందికీ కదిలించి చూడమన్నాడు. దానివల్ల చీమలు ఒకదాని మీద ఒకటి కుప్పలుగా పడిపోతాయి. దాంతో చీమల ప్రవర్తనలో మార్పువస్తుంది. నల్లచీమలు-ఎర్రచీమలే తమని చంపుతున్నాయి అని అనుకుంటాయి. అలాగే ఎర్రచీమలు తమను నల్లచీమలే చంపుతున్నాయి అనుకుంటాయి. గమనిస్తే నల్ల చీమలు-ఎర్ర చీమలు చంపుకోవడం ప్రారంభిస్తాయి. నిజానికి అక్కడ అసలు శత్రువు ఎవరూ అంటే... గాజు సీసాను పైకి కిందికీ ఊపి, చీమల ప్రశాంతతను చెడగొట్టినవారు. ఆ రెండు రకాల చీమల మధ్య ఘర్షణ వాతావరణాన్ని సృష్టించి-వాటి మధ్య అంతర్యుద్ధానికి కారణమైనవారు - వారే అసలు దోషులు! ఇప్పుడు మన దేశంలో జరుగుతున్నదీ అదే. ఇక్కడి ప్రజలు ఒకరికొకరు శత్రువులు కారు. ప్రజల మధ్య శత్రుత్వాన్ని పెంచి పోషిస్తున్నది పాలకులేనన్నది బహిరంగ రహస్యం. తెల్లరంగుకూ నల్లరంగుకూ మధ్య, పురుషులకూ స్త్రీలకూ మధ్య, ధనిక పేద వర్గాల మధ్య, అగ్ర, నిమ్న వర్ణాల మధ్య వివిధ జాతుల మధ్య, మతాల మధ్య నిరంతరం ఘర్షణ వాతావరణాన్ని సృష్టిస్తున్నది దెవరు? ఎప్పుడో మార్క్‌ట్విన్ చెప్పిన ప్రయోగం ఈ దేశంలో శతాబ్దాలుగా జరుగుతూనే ఉంది. సమకాలీనంలో మరీ ఎక్కువగా జరుగుతూ ఉంది. ఈ సమాజపు గాజు సీసాను కుదుపుతున్నది ఎవరో వివేకవంతులైన సామాన్య ప్రజలు ఎల్లప్పుడూ గమనిస్తూనే ఉండాలి!

కొందరు విచక్షణా జ్ఞానాన్ని కోల్పోయి స్వంత బిడ్డల్ని సైతం చంపుకునే వరకు వెళుతున్నారు. మనుషుల్ని నరికి వండుకుతినే వరకు వెళుతున్నారు. ఇందులో విద్యావంతులు అవునా కాదా అనే దానికి ప్రాధాన్యత లేదు. ఆటవికులా? గ్రామీణులా? నగరవాసులా? అనే దానికి కూడా ప్రాధాన్యత లేదు.

సమాజంలో కొందరు వ్యక్తులు పనిగట్టుకుని అంధవిశ్వాసాలు ప్రజల జీవితాల్లో ప్రధాన భాగమై ఉండేట్లు జాగ్రత్తలు తీసుకుంటారు. అలా జనాన్ని నిస్సహాయులుగా తయారు చేసి, వారిపై తమ పట్టు బిగిస్తారు. కొందరు కొంత కాలానికి తమ విచక్షణా జ్ఞానాన్ని కోల్పోయి, ఒక్కోసారి అమానవీయంగా కూడా ప్రవర్తిస్తుంటారు. నిత్యం మనం అలాంటి సంఘటనలు చూస్తూనే ఉన్నాం. మెదడులో జరిగే ఈ పరివర్తనల్ని మానసిక శాస్త్రం పూర్తిగా వివరిస్తుంది. నేటి యువతీ యువకులు అలాంటి విషయాలు అధ్యయనం చేయడం అవసరం. ఎవరి మెదడును వారు అదుపులో ఉంచుకుంటే చాలు విద్యావంతులు కూడా అవసరమైన సైన్సు, తర్కం, విశ్వ పరిజ్ఞానం, చరిత్ర వంటివి వదిలేసి మహిమలు, మాయలు, సినిమాలు, టెలివిజన్ సీరియల్స్, రియాల్టీషోలు... అందులో అక్రమ సంబంధాల కథలు, అక్రమ సంపాదనల కథలు, అక్రమ మార్గాన అధికారపీఠాలెక్కే కథలు చూస్తూ ప్రభావితులవుతున్నారు. అనైతికంగా కోట్ల ఆస్తుల్ని స్వంతం చేసుకునే సన్నాసుల జీవిత చిత్రణలు జన సామాన్యాన్ని ఏ విధంగా ప్రభావితం చేస్తున్నాయో? కొంచెం ఆలోచించుకోవాలి కదా? రాబోయే తరాలకు మనం ఎలాంటి సమాజాన్ని ఇవ్వబోతున్నామో విశ్లేషించుకోవాలి కదా?

నిత్య జీవితంలో మనం నీరు కాచి వడబోసి తాగుతున్నాం. ఎందుకూ? ఆరోగ్యం కాపాడుకోవడం కోసం. ఆహారం తీసుకోవడంలో శుభ్రతని పాటిస్తున్నాం. వాతావరణ కాలుష్యాల నుంచి తప్పించుకుంటున్నాం. ఇవన్నీ ఎంతో ప్రాధాన్యమున్న అంశాలు. అలాగే మూఢ నమ్మకాలకు బలికాకుండా ఆరోగ్యకరమైన ఆలోచనలతో జీవితం గడపడం అవసరం.

"ఉనికిలో లేని ఒక 'ఉత్పత్తి'కి (PRODUCT) చేసే వ్యాపార ప్రకటనే - మతం" -క్లైవ్ జేమ్స్.

(ఆస్ట్రేలియన్ రచయిత, జర్నలిస్ట్. 57 సంవత్సరాలు యూ.కె.లో 'టెలివిజన్ సమీక్షకుడిగా, వ్యాఖ్యాతగా వ్యవహరించారు)

వీటన్నిటికి తోడు ప్రధానులు, ముఖ్యమంత్రులు, గవర్నర్ల వంటి రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారు ఇతరత్రా ఉన్నత స్థాయిలో ఉన్నవారి ప్రవర్తనల్ని, వారి ఉపన్యాసాల్ని జనం విశ్లేషించుకుంటూ ఉండాలి. అవి మన రాజ్యాంగానికి లోబడి ఉన్నాయా లేదా అని అవలోకించుకుంటూ ఉండాలి. ఉన్నతస్థితికి చేరినంత మాత్రాన వారికి మానసిక బలహీనతలు ఉండవని కాదుగదా? బలాలతో పాటు బలహీనతలూ ఉంటాయి. పైగా వారి ప్రాచుర్యాన్ని సమాజంలో నిలుపుకోవడానికి జనంలో ఉన్న బలహీనతల్ని కాపాడే ప్రయత్నమే చేస్తారు. జనం బలహీనతల్ని వదిలించే ప్రయత్నం ఏ మాత్రమూ చేయరు. దొంగ సన్యాసుల కాళ్లు మొక్కుతూ సామాన్య జనానికి వీరు కూడా ఒక 'సూచన' చేస్తుంటారు. ప్రజలు తాము నిత్యం ఎదుర్కొనే సమస్యలపై పోరాడకుండా ఉంటేనే వారిని పరిపాలించడం సులభమని వీరికి తెలుసు అలాంటి సంకేతాల్ని జనం తిప్పి కొట్టాలి. ఏమాత్రం ప్రభావితం కాకుండా ప్రశ్నించడాన్ని, సంఘర్షిస్తూ తమ హక్కులను సాధించుకోవడాన్ని ఏ మాత్రమూ వదులుకోకూడదు.

"జనం గ్రహించే విధంగా అబద్దాలను ఎండ గట్టడం, నిజాలను నిర్భయంగా ఎలుగెత్తి చెప్పడం మేధావుల కర్తవ్యం" అని అన్నారు నోమ్‌చామ్‌స్కీ- (అమెరికన్ భాషా శాస్త్రవేత్త, తాత్వికుడు, సామాజిక సమీక్షకుడు, రాజకీయ కార్యకర్త). ఏ ఆలోచనలైతే వాస్తవానికి దగ్గరగా ఉంటాయో, జన బాహుళ్యానికి ఉపయోగకరంగా ఉంటాయో, మానవీయ విలువలతో ఉంటాయో వాటినే మనం ఆచరించాలి. వాటి గురించే ఇతరులకు చెప్పాలి. అంతే! అందుకు విరుద్ధంగా అంధవిశ్వాసాల మీద ఆధారపడ్డ ఆలోచనలను సమూలంగా నాశనం చేయాలి. అహింస, ద్వేషం, హేతువాదంతో జయించాలి! అందుకు అనుక్షణం సంసిద్ధులమై ఉండాలి !

(వ్యాసకర్త: కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు విజేత, జీవశాస్త్రవేత్త.)

వయోవృద్ధులకు రెడ్ సిగ్నల్

భారతీయ రైల్వేలు... ప్రయాణ ప్రగతికి మార్గాలు...కాదనలేని నానుడి. అయితే తాజాగా కేంద్ర ప్రభుత్వ ప్రకటన ప్రధానంగా వయోవృద్ధులను తీవ్రంగా కలచివేసింది. గతంలో అమలైనసీనియర్ సిటిజన్స్ రాయితీలను కొనసాగించలేమని, ఇప్పట్లో సాధ్యం కాదని పార్లమెంటు సాక్షిగా ప్రభుత్వం వెల్లడించింది. ఈ తరహా రాయితీల విషయమై పట్టించుకోక పోవడంతో సకల జనులు దిగ్భ్రాంతికి గురయ్యారు. సాధారణ ప్రజానీకానికి ప్రయాణ వాహక నౌకగా కీర్తించబడే రైళ్ళలో సీనియర్ సిటిజన్లకు రాయితీలు ఎత్తేయడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దూరాన్ని, ప్రయాణానుభూతి చౌకగా లభించే సౌకర్యం చేజారటం నివ్వెర పరచింది. జనులందరికీ ఉపయుక్తమైన చర్యలను నిలిపివేయడమేమిటని ప్రశ్నిస్తున్నారు.

రైళ్ళలో గతంలో సాధారణ ప్రయాణికుల్ని దృష్టిలో ఉంచుకుని 58 ఏళ్లు నిండిన మహిళలకు 50 శాతం, 60ఏళ్లు నిండిన పురుషులకు 40 శాతం రాయితీలు ఇస్తున్నారు ఈ సౌకర్యం ఎన్నో ఏళ్ళనుంచి అమలౌతోంది. కరోనా పుణ్యమాని సీనియర్ సిటిజన్స్ రాయితీలను నిలిపివేశారు. ఆ పిమ్మట అంతటా సాధారణ పరిస్థితులు నెలకొన్నా రాయితీల పునరుద్ధరణ జరగలేదు. ఇక ఈ రాయితీల వల్ల ప్రభుత్వానికి ఎంతో భారమౌతోందంటూ నిన్నటికి నిన్న మన రైల్వే మంత్రి సెలవిచ్చారు. అయితే ఈ భారం కరోనా ముందు కూడా ఉన్నదే అంటూ వయో వృద్ధులు పేర్కొంటున్నారు. ప్రతి మనిషీ ఏదో ఒక రోజున సీనియర్ సిటిజన్ కావడం తప్పదంటున్నారు. ప్రయాణికుల సేవల కోసం ప్రభుత్వం గత ఏడాది. రూ. 59వేల కోట్లు రాయితీ ఇచ్చిందని కేంద్రం చెబుతోంది. అదే సమయంలో ఎప్పటికప్పుడు కొత్త సదుపాయాలు సమకూరుస్తున్నట్లు రైల్వే శాఖ వివరిస్తోంది. అయితే రాయితీల అంశం ప్రయాణికుల సదుపాయాల్లోకి రాకపోవడం శోచనీయమని సీనియర్ సిటిజన్ల సంఘాలు నివేదిస్తున్నాయి.

సగటు జీవికి అందుతున్న రైల్వే రాయితీలు భారమవుతున్నాయంటున్న పాలకులు కార్పోరేట్లు, బహుళ జాతి సంస్థలకు దేశ సంపదను అప్పనంగా కట్టబెట్టటం లేదా? అనే ప్రశ్నలు ఉద్భవిస్తున్నాయి. దీన్ని మేధావులు, మీడియా



తులనాత్మకంగా ప్రస్తావించకపోవడం దురదృష్టకరమన్న వ్యాఖ్యలూ వినిపిస్తున్నాయి.

గరీబ్ రథ్ పేరిట అప్పట్లో సరికొత్త రైళ్ళను సాధారణ, మధ్యతరగతి ప్రయాణికుల కోసం ప్రవేశపెట్టారు. ఏసీ బోగీల్లో ప్రయాణిస్తూ చౌకగా గమ్యాలను చేరుకునేలా ప్రణాళికలు రూపొందించారు. జనంకూడా కాస్తంత తక్కువ ధరలోనే టికెట్లు కొని ప్రయాణ అనుభూతిని పొందారు. ఈ తరహాలో వయోవృద్ధులకు రాయితీలిచ్చే సమగ్ర ప్రణాళికను రూపొందించాల్సిన ప్రభుత్వం పట్టించుకోలేదు. రైల్వేలు సాంకేతిక పరంగా గొప్ప ప్రగతినే చాటాయి. సమయంకుదింపు... టెక్నాలజీ సమ్మిళితమైన ఎన్నో ఆకర్షణలు భాగమయ్యాయి. కరోనా అనంతరం ఈ రాయితీల పునరుద్ధరణ కోసం అందరూ డిమాండ్ చేస్తున్నారు. ఆ మధ్య... రాయితీల ప్రకటనపై తర్జన భర్జనలు జరుగుతున్నాయని వార్తలొచ్చాయి. వయోపరిమితిని 60 నుంచి 70 ఏళ్ళకు పెంచడం, జనరల్ క్లాస్, స్లీపర్ క్లాస్ లకు మాత్రమే వర్తించేలా ప్రకటన రావచ్చంటూ ఊదర కొట్టారు. అయితే వారంలోనే సీనియర్ సిటిజన్ల రాయితీ ఇప్పట్లో లేదని రైల్వే మంత్రి ప్రకటనలో స్పష్టత ఇచ్చారు. ఏతావాతా పలువురికి ఉపకరించే సీనియర్ సిటిజన్స్ రాయితీల పునరుద్ధరణ పై కేంద్రం పెద్ద మనసుతో వ్యవహరించాలని, వారి అనుభూతులను పరిగణించాలని సకల జనుల ఆకాంక్ష....ఘోషా...!

-చెన్నుపాటి రామారావు

9959021483.

(రచయిత : విశ్రాంత పాత్రికేయుడు)

బీమాలో కార్పొరేట్లు వద్దు

- డెయిరీ దిగుబడుల సరళీకరణ ఆపాలి
- ఏడు తీర్మానాలు ఆమోదించిన ఎఐకెఎస్ మహాసభ

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- కె వరదరాజన్ నగర్ (త్రిసూర్)

ప్రభుత్వరంగ కంపెనీలతోనే పంటల బీమాను అమలు చేయాలని అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) 35వ మహాసభ కేంద్రాన్ని డిమాండ్ చేసింది. విపత్తుల వలన పంట నష్ట పోయిన రైతాంగానికి పారదర్శకంగా తక్షణం పరిహారం చెల్లించాలని కోరింది. కంపెనీల నుంచి క్లెయిముల పరిష్కారం కోసం రైతులను సమీకరించి ఒత్తిడి తేవాలని పిలుపునిచ్చింది. మూడవ రోజు గురువారం మహాసభ ఏడు తీర్మానాలను ఆమోదించింది. క్రాప్ ఇన్సూరెన్స్ తీర్మానంలోని ముఖ్యాంశాలు... కేంద్రం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన ప్రైవేటు కంపెనీల దోపిడీకి ఉపయోగపడుతోంది. రైతులకు ఏ మాత్రం ప్రయోజనం కలగట్లేదు. పంటల బీమా పథకాలను ప్రభుత్వ కంపెనీలతోనే అమలు చేయాలి. తక్షణం ప్రైవేటు కంపెనీల జోక్యాన్ని నిలిపేయాలి. జావాబుదారీతనం, పారదర్శకత, వేగంగా క్లెయిముల పరిష్కారం కోసం ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ రూపొందించాలి. కేంద్రంతో సంబంధం లేకుండా రాష్ట్రాలు తాము సొంతంగా ఇన్సూరెన్స్ పథకాలు అమలు చేయదలుచుకుంటే అందుకు అవసరమైన ఆర్థిక వనరులను కేంద్రం సమకూర్చాలి. పంట నష్టం అంచనాలు, సర్వే వంటి విషయాల్లో నియంతృత్వ ధోరణిని తొలగించి రైతులకు క్లెయిములు పరిష్కారం చేసేందుకు స్నేహపూర్వకంగా వ్యవహరించాలి...


'మద్దతు ధర..చట్టబద్ధత' అంశంపై చర్చల్లో పాల్గొన్న ప్రతినిధులు



ఆంధ్రప్రదేశ్ ప్రతినిధుల తరపున మహాసభలో ప్రసంగిస్తున్న హేమలత

డెయిరీ ఉత్పత్తులకు గిట్టుబాటు

దేశంలోకి పాల ఉత్పత్తుల దిగుబడులపై ఉన్న ఆంక్షలను సరళీకరిస్తూ మోడీ ప్రభుత్వం చేపట్టిన చర్యలను ఉపసంహరించుకోవాలని మహాసభ తీర్మానించింది. నిజమైన సహకార వ్యవస్థను డెయిరీలో ప్రవేశపెట్టి విధానపరంగా ప్రభుత్వం అన్ని విధాలా సహకరించాలని, పాల రైతుల ఖర్చులు తగ్గించాలని, డెయిరీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, పశువుల రవాణాకు అనుమతించాలని, పశువుల రవాణాపై ఆంక్షలు విధిస్తూ బిజెపి రాష్ట్ర ప్రభుత్వాలు తెచ్చిన చట్టాలను రద్దు చేయాలని, గోరక్షణ పేరుతో జరుగుతున్న దాడులను అరికట్టాలని మహాసభ తీర్మానం ఆమోదించింది.

వాతావరణ మార్పులపై..

వాతావరణ మార్పుల వలన అకాల వర్షాలు, వరదలు, కరువులు వచ్చి రైతులు పంటలు నష్టపోతున్నారని మహాసభ ఆందోళన వ్యక్తం చేసింది. భారత ప్రభుత్వం వాతావరణ మార్పులపై అభివృద్ధి చెందిన దేశాలపై ఒత్తిడి చేసి వారి పాత్ర పెంచాలని డిమాండ్ చేస్తూ తీర్మానించింది. వాతావరణ మార్పుల వలన పంటలకు జరుగుతున్న నష్టంపై దేశంలోని వాతావరణ జోన్ల ప్రాతిపదికన శాస్త్రీయంగా అధ్యయనం చేసి పరిష్కారాలు కనుగొనాలి. రైతులను ముందస్తుగా అప్రమత్తం చేయాలి. కార్పొరేట్లకు కాకుండా వ్యవసాయం రైతులకు గిట్టుబాటయ్యే విధంగా చర్యలు చేపట్టాలి... అని డిమాండ్ చేసింది. అటవీ హక్కుల చట్టాన్ని అమలు చేసి గిరిజనులకు భూములపై హక్కులు కల్పించాలని, ప్రజలందరికీ ఆహారభద్రత కల్పించాలని, ప్రజాపంపిణీ వ్యవస్థను బలోపేతం చేయాలని, చక్కెర రైతులకు స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేయాలని, వన్య మృగాలు, జంతువుల బారి నుంచి పంటలను, ప్రజలను రక్షించాలని మహాసభ తీర్మానాలు చేసింది.

మూడు కమిషన్లు

రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై మహాసభ మూడు కమిషన్లు వేసింది. భూమి సంబంధ విషయాలు, పంటల కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి)లకు చట్ట బద్ధత, వ్యవసాయరంగంలోకి ఫైనాన్స్ పెట్టుబడులపై కమిషన్లు విస్తృతంగా చర్చలు జరిపాయి. ప్రతినిధులు మూడు కమిషన్ల సమావేశాల్లో పాల్గొన్నారు. కమిషన్లకు కన్వీనర్లుగా వ్యవహరించిన రామ్ కుమార్, వికాస్ రావత్, సూర్జిత్ మజుందార్ తమ నివేదికలను మహాసభకు వివరించారు.

సంఘ బలోపేతానికి హామీ

మహాసభలో ఎఐకెఎస్ నిర్మాణంపై ప్రతినిధులు ఉత్సాహంగా చర్చల్లో పాల్గొన్నారు. సంఘాన్ని విస్తరించి బలోపేతం చేస్తామని, వచ్చే మూడు నాలుగేళ్లలో సభ్యత్వాన్ని లక్ష్యానికనుగుణంగా పెంచుతామని హామీ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ నుంచి హేమలత మాట్లాడుతూ వచ్చే మహాసభ నాటికి రాష్ట్రంలో సభ్యత్వాన్ని 5 లక్షలకు పెంచుతామన్నారు. కౌలు రైతుల సంఘం ప్రత్యేకంగా ఉందని, ఆ సంఘ సభ్యత్వాన్ని లక్షా 50 వేలకు పెంచుతామని చెప్పారు. భూమి సంబంధ సమస్యలు ముందుకొస్తున్నాయని, వాటిపై కేంద్రీకరించి పని చేస్తామన్నారు. నల్ల వ్యవసాయ చట్టాల రద్దు కోసం జరిగిన పోరాటంతో ఎఐకెఎస్ ప్రతిష్ట పెరిగిందని, నిర్మాణానికి ఉపయోగపెట్టుకుంటామని, స్వతంత్ర, ఐక్య కార్యాచరణ చేపడతామని వివరించారు. తెలంగాణ నుంచి సుధాకర్‌రెడ్డి చర్చల్లో పాల్గొన్నారు. సిఐటియు జాతీయ అధ్యక్షురాలు కె హేమలత సౌహార్ద సందేశమిచ్చారు.



ఎస్‌ఎఫ్‌ఐ మహాసభలో అభివాదం చేస్తున్న వివిధ విద్యార్థి సంఘాల నాయకులు

విద్యారంగంలో కేరళ మోడల్‌ను అమలు చేయాలి

- ఎస్ఎఫ్ఐ అఖిల భారత మహాసభలో తీర్మానం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వ విద్యను ప్రోత్సహిస్తున్న వామపక్ష పాలనలోని కేరళ విద్య మోడల్‌ను దేశవ్యాప్తంగా ప్రత్యామ్నాయ విద్య విధానంగా అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ జాతీయ మహాసభ తీర్మానించింది. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లో ఎస్ఎఫ్ఐ 17వ జాతీయ మహాసభలో ఇ.అఫ్జల్ తీర్మానాన్ని ప్రతిపాదించగా, సత్యేషా బలపరిచారు. ఒక్కో నియోజకవర్గానికి అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఒక్కో స్కూల్‌ను ఏర్పాటు చేసి కేరళ ప్రభుత్వం రూ.ఐదు కోట్లను కేటాయించిందని తెలిపారు. అక్కడి బడులకు ప్రభుత్వం భవనాలు, హైటెక్ సాంకేతిక సౌకర్యాలను కల్పించిందని తెలిపారు. దీని ఫలితంగా గత ఆరేండ్లలో ప్రయివేటు పాఠశాలలకు చెందిన 6.5 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరినట్టు వెల్లడించారు. సిఎఎ,ఎన్‌టిఎ, సియుఇటికి వ్యతిరేకంగా మహాసభ తీర్మానించింది. వాతావరణ మార్పులపై ప్రభావవంతంగా పోరాడాలనీ, విద్యాలయాల ప్రాంగణాల్లో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించాలనీ, కర్ణాటకలో ముస్లిం విద్యార్థినీలు హిజాబ్ ధరించడాన్ని నిషేధిస్తూ అక్కడి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ప్రతిపాదించిన కూడా మహాసభ తీర్మానాలను ఆమోదించింది. బహుళ భాషల వైవిధ్య భారతదేశంలో ఒకే భాషను రుద్దే ప్రయత్నాలను తప్పుపట్టింది. నిరుద్యోగానికి వ్యతిరేకంగా పోరాడాలని ఎస్ఎఫ్ఐ నిర్ణయించింది. ప్రపంచశాంతిని ఆకాంక్షించింది. మొత్తంగా గురువారం నాటి మహాసభలో తొమ్మిది తీర్మానాలను ఆమోదించారు.

మచిలీపట్నం పోర్టు పనుల రద్దుపై వాదనలు పూర్తి

- మధ్యవర్తిత్వానికి అంగీకారం తెలిపేందుకు నవయుగకు అవకాశం
- సిజెఐ జస్టిస్ చంద్రచూడ్ ధర్మాసనం ఆదేశాలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మచిలీపట్నం పోర్టు పనుల రద్దుపై నవయుగ కంపెనీ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు వాదనలు పూర్తి చేసింది. మధ్యవర్తిత్వానికి తాము అంగీకరిస్తున్నామని హైకోర్టు డివిజన్ బెంచ్‌కు తెలియజేయడానికి నవయుగ కంపెనీకు సుప్రీం కోర్టు స్వేచ్ఛ ఇచ్చింది. మచిలీపట్నం ఓడరేవు నిర్మాణం కోసం నవయుగతో ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేస్తూ ఇచ్చిన ప్రభుత్వ ఉత్తర్వులను (జిఓ) నిలిపివేయాలని కోరుతూ నవయుగ పోర్ట్ లిమిటెడ్ దాఖలు చేసిన రెండు మధ్యంతర దరఖాస్తులను ఆంధ్రప్రదేశ్ హైకోర్టు కొట్టివేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. దీనిని సవాల్ చేస్తూ నవయుగ పోర్ట్ లిమిటెడ్ సుప్రీం కోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌ను గురువారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్, న్యాయమూర్తి జస్టిస్ పిఎస్ నరసింహంలతో కూడిన ధర్మాసనం విచారించింది. తొలిత నవయుగ కంపెనీ తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపిస్తూ మధ్యవర్తిత్వం కోసం తాము అభ్యర్థించటం లేదని, టెండర్లు పిలిస్తే మూడో పార్టీ హక్కులు కల్పించబడతాయని అన్నారు. దీనికి సిజెఐ చంద్రచూడ్ జోక్యం చేసుకొని మీరు సెక్షన్ 17 ప్రకారం మధ్యవర్తిత్వ దరఖాస్తును ఎందుకు ఫైల్ చేయకూడదని ప్రశ్నించారు. రోహత్గీ స్పందిస్తూ అయితే సుప్రీం కోర్టే మధ్యవర్తిని నియమించాలని అన్నారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ జోక్యం చేసుకొని, తాము దీనిపై స్పందించే ముందు, రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదించాలని, రాష్ట్ర ప్రభుత్వ సమ్మతి తీసుకోవాలని అన్నారు. సిజెఐ చంద్రచూడ్ జోక్యం చేసుకొని రాయితీ ఒప్పందాన్ని రద్దు చేయడం రిట్ పిటిషన్ కింద పరిష్కరించడం కష్టమని, ఇది మౌలిక సదుపాయాల ప్రాజెక్ట్ పూర్తిగా ఆగిపోతుందని అన్నారు. న్యాయవాది సింఘ్వీ జోక్యం చేసుకొని గత నాలుగేళ్లలో రిట్ పిటిషన్‌తో కోర్టు ముందు అవకాశాన్ని తీసుకున్నారని తెలిపారు. మధ్యవర్తిత్వానికి రిఫర్ చేస్తే తాను సంతోషిస్తానని న్యాయవాది రోహత్గీ తెలిపారు. మధ్యవర్తిత్వానికి తాము అంగీకరిస్తున్నామని హైకోర్టు డివిజన్ బెంచ్‌కు తెలియజేయడానికి నవయుగ కంపెనీకి స్వేచ్ఛ ఇస్తూ, పిటిషన్‌ను తిరస్కరించారు. భూమి కేటాయించినా పోర్టు నిర్మించడంలో నవయుగ ఆలస్యం చేసిందని కాంట్రాక్టును ఏపి ప్రభుత్వం రద్దు చేసింది. త్వరితగతిన పోర్టు నిర్మాణం పూర్తి చేయడమే లక్ష్యమని ఏపి ప్రభుత్వం తెలిపింది.



రాత్రి వేళలా.. గురి తప్పని అగ్ని 5

న్యూఢిల్లీ : 5 వేల కిలోమీటర్ల కంటే ఎక్కువ దూరం లక్ష్యాలను ఛేదించే అణు సామర్థ్యం గల అగ్ని 5 బాలిస్టిక్ క్షిపణి రాత్రి సమయంలో పరీక్షలనూ (నైట్ ట్రయిల్స్) భారత్ విజయవంతంగా పూర్తిచేసింది. ఈ విషయాన్ని కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ గురువారం వెల్లడించింది. క్షిపణిలోని నూతన సాంకేతికలు, పరికరాలను ధృవీకరించడానికి ఈ పరీక్ష నిర్వహించబడిందని, అలాగే, ఈ పరీక్షతో మరింత దూరంలో ఉన్న లక్ష్యాలను అగ్ని 5 ఛేదించగలదని రుజువయిందని మంత్రిత్వ శాఖ తెలిపింది. ఒడిషా తీరంలోని అబ్దుల్ కలాం ద్వీపం నుంచి ఈ పరీక్ష జరిగింది. 2012లో అగ్ని 5ను తొలిసారి పరీక్షించిన తరువాత ఈ క్షిపణికి ఇది తొమ్మిదో పరీక్ష. సాధారణ పరీక్షల్లో భాగంగానే తాజా పరీక్ష జరిగిందని రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. తాజా పరీక్ష విజయంతో భారత దేశ యొక్క వ్యూహాత్మక దళ కమాండ్‌లో అగ్ని 5 చేరడానికి సిద్ధంగా ఉంది. అలాగే 5 వేలకు కిలోమీటర్లకు పైగా దూరంలో ఉన్న లక్ష్యాలను ఛేదించే అగ్ని 5 పరీక్ష విజయంతం కావడంతో ఖండాతర బాలిస్టిక్ క్షిపణి భారత్‌కు అత్యవసరం కాదు.

జెఇఇ-మెయిన్స్ నోటిఫికేషన్ విడుదల

న్యూఢిల్లీ : దేశంలో ప్రముఖ విద్యా సంస్థలో ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే జెఇఇ మెయిన్-2023 పరీక్ష తేదీలు విడుదలయ్యాయి. ఈ మేరకు జేఈఈ మెయిన్ 2023 నోటిఫికేషన్ జాతీయ పరీక్షల మండలి (ఎన్‌టిఎ) గురువారం విడుదల చేసింది. జనవరిలో తొలి విడత, ఏప్రిల్‌లో రెండో విడత పరీక్షలు నిర్వహిస్తున్నట్టు ప్రకటించింది. తొలి సెషన్‌ను జనవరి 24, 25, 27, 29, 29, 30, 31 తేదీల్లో నిర్వహించనుండగా.. రెండో సెషన్ ఏప్రిల్ 6 నుంచి 12 వరకు జరుగుతుందని ఎన్‌టిఎ తెలిపింది. జెఇఇ మెయిన్ పరీక్షను 13 భాషల్లో (ఇంగ్లీష్, హిందీ, తెలుగు, అస్సామీ, బెంగాలీ, గుజరాతీ, కన్నడ, మలయాళం, మరాఠీ, ఒడిశా, పంజాబీ, తమిళ్, ఉర్దూ) నిర్వహించనున్నారు. తొలి సెషన్ పరీక్షకు ఈ నెల 15 నుంచి జనవరి 12 రాత్రి 9గంటల వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. పరీక్ష ఫీజు చెల్లించేందుకు జనవరి 12 రాత్రి 11.50 నిమిషాల వరకు గడువు విధించారు. ఏ నగరంలో పరీక్ష నిర్వహిస్తామనేది జనవరి రెండో వారంలో ప్రకటించనున్నారు. అడ్మిట్ కార్డులను జనవరి మూడో వారంలో ఎన్‌టీఏ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి. జెఇఇ మెయిన్ పరీక్షలను ప్రతీ ఏడాది దాదాపు 10లక్షల మంది విద్యార్థులు రాస్తుంటారు.

'గోద్రా' దోషికి బెయిల్

న్యూఢిల్లీ : గోద్రా రైలు దగ్ధంకు సంబంధించిన కేసులో జీవిత ఖైదు అనుభవిస్తున్న ఫారుక్‌కు సుప్రీంకోర్టు గురువారం బెయిల్ మంజూరు చేసింది. ఆ వ్యక్తి 17 ఏళ్ల పాటు జైల్లోనే ఉన్న కారణంగా బెయిల్ ఇస్తున్నట్లు సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ కేసులో మిగిలిన మరికొంత మంది దోషులు కూడా బెయిల్ కోసం దరఖాస్తు చేసుకోగా.. ఆ పిటిషన్లపై సుప్రీంకోర్టు ఇంకా నిర్ణయం తీసుకోలేదు. 2002, ఫిబ్రవరి 27న గోద్రా రైల్వేస్టేషన్‌లో సబర్మతి ఎక్స్‌ప్రెస్ రైలుకు నిప్పంటించడంతో ఎస్-6 బోగీలోని 59 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన సమయంలో బోగీపై రాళ్లదాడికి పాల్పడినందుకు గానూ ఫారుక్ సహా మరికొందరికి యావజ్జీవ కారాగార శిక్ష పడింది.

అదానీకి అక్రమంగా ప్రభుత్వ బొగ్గు !

- దశాబ్ద కాలంగా యథేచ్ఛగా సాగుతున్న వైనం
- ఫలించని ఆదివాసీల పోరాటం
- సమర్థించుకుంటున్న ప్రభుత్వాలు



న్యూఢిల్లీ : రాజస్థాన్ ప్రభుత్వ విద్యుత్ సంస్థలకు కేటాయించిన బొగ్గు అక్రమంగా గత దశాబ్ద కాలంగా అదానీ గ్రూపునకు చెందిన విద్యుత్ స్టేషన్లకు తరలిపోతోంది. సమాచార హక్కు చట్టం ద్వారా ఈ విషయం బట్టబయలైంది. ఇందుకు సంబంధించిన రికార్డులు మీడియా చేతికి అందాయి. చత్తీస్‌ఘడ్‌కి ఉత్తరంగా హస్‌దేవ్ ఆరంద్ అటవీ ప్రాంతంలో 762 హెక్టార్లలో విస్తరించి వున్న ఓపెన్ కాస్ట్ గని నుండి గత దశాబ్ద కాలంగా అదానీ ఎంటర్‌ప్రైజెస్ బొగ్గును తవ్వుకుంటోంది. ప్రభుత్వ అనుమతులన్నీ అనుకున్న విధంగా వచ్చినట్లైతే ఇదే ప్రాంతంలో మరో 2వేల హెక్టార్లకు పైగా అటవీ ప్రాంతంలో బొగ్గు తవ్వకాలు విస్తరించబడతాయి. అయితే ఈ కార్యకలాపాలను అక్కడ గల ఆదివాసీలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. దేశంలోనే అత్యంత సంపన్నుడైన అదానీకి చెందిన మైనింగ్ సంస్థతో వారు ఏళ్ళ తరబడి పోరాటం చేస్తున్నారు. కొత్త గనులకు ప్రభుత్వం అనుమతులు ఇవ్వరాదంటూ గతేడాది వందలాదిమంది గ్రామస్తులు 300కిలోమీటర్లు దూరంలోని రాజధాని రాయపూర్‌కు ప్రదర్శనగా వెళ్లి విజ్ఞప్తులు అందచేశారు. ఈ నేపథ్యంలో ఆ ప్రాజెక్టులకు అనుమతులను చత్తీస్‌ఘడ్ ప్రభుత్వం ఇటీవల నిలుపుచేసింది.

ఇదిలా వుండగా, జీవ వైవిధ్యం సుసంపన్నంగా గల ఈ ప్రాంతంలో బొగ్గు తవ్వకాలకు అనుమతించడాన్ని కేంద్ర ప్రభుతం కూడా సమర్థించుకుంటోంది. ప్రజా ప్రయోజనాలను ఇందుకు సాకుగా చూపుతోంది. రాజస్థాన్‌లోని విద్యుత్ స్టేషన్లకు బొగ్గు అవసరమని అందుకే బొగ్గు తవ్వకాలకు అనుమతినిచ్చామని చెబుతోంది. వాస్తవానికి, రాజస్థాన్ విద్యుత్ ఉత్పత్తి కంపెనీ రాజస్థాన్ రాజ్య విద్యుత్ ఉత్పాదన్ నిగమ్ లిమిటెడ్‌కు ఈ గనులను కేటాయించారు. కానీ ఈ ప్రభుత్వ సంస్థ వివాదాస్పద రీతిలో అదానీ ఎంటర్ ప్రైజెస్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. పర్సా కెంటే కాలరీస్ లిమిటెడ్ అనే పేరున్న అదానీ సంస్థకు గనుల తవ్వకాలను ఔట్‌సోర్సింగ్‌కు ఇచ్చింది. ఒప్పంద నిబంధనల కింద అదానీ కంపెనీకి ఇందులో 74శాతం వాటాలు వున్నాయి. పర్సా ఈస్ట్, కాంతా బసన్ మైన్‌ల నుండి తిరస్కరించబడిన లేదా తక్కువ నాణ్యత కలిగిన బొగ్గును అమ్ముకునేందుకు అదానీ కంపెనీకి అధికారమివ్వబడింది. ప్రభుత్వ సంస్థల కోసం కేటాయించిన బొగ్గును అదానీ గ్రూపు తన స్వంత విద్యుత్ స్టేషన్ల అవసరాల కోసం ఉపయోగించుకోవడానికి ఇదొక దొడ్డి దారి పద్ధతి అంటూ మానవ హక్కుల కార్యకర్తలు, ఆదివాసీలు సుదీర్ఘకాలంగా ఆందోళన చేస్తూనే వున్నారు. ఈ నేపథ్యంలో సమాచార హక్కు చట్టం ద్వారా మొట్టమొదటిసారిగా ఇందుకు సంబంధించిన రైల్వే సరుకు రవాణా రికార్డులు లభ్యమయ్యాయి. వాటి ప్రకారం పర్సా ఈస్ట్, కాంతా బసన్ గనుల నుండి తిరస్కరించబడిన లక్షలాది టన్నుల బొగ్గు నిజానికి అదానీకి చెందిన మూడు విద్యుత్ ప్లాంట్లలోకి చేరుతోందనేది స్పష్టంగా వెల్లడైంది. కోల్ ఇండియా లిమిటెడ్ విధించే అత్యంత తక్కువ ధర కన్నా కూడా చాలా తక్కువకే ఈ బొగ్గును అదానీకి అమ్ముతున్నారు. అదానీ పవర్ కొనుగోళ్ల ఆర్డర్లకి సంబంధించిన పత్రాలు మీడియాకి లభించిన నేపథ్యంలో కొన్ని ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అదానీ పవర్ స్టేషన్లకు ఈ చవక రకం బొగ్గు సరిపోతున్నపుడు రాజస్థాన్ విద్యుత్ ప్లాంట్లకు ఎందుకు సరిపోవడం లేదన్నది ఇక్కడ ప్రధాన ప్రశ్నగా వుంది. గతేడాదిలో ఈ గనుల నుండి కోటి 50లక్షల టన్నుల బొగ్గు అదానీ విద్యుత్ కంపెనీలకు సరఫరా అయింది.

పెట్రో ధరలపై ప్రతిపక్షాలు ఆందోళన

- కేంద్ర మంత్రి ప్రకటనపై నిరసన
- ప్రతిపక్షాలతో కలిసి వాకౌట్ చేసిన వైసిపి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పెట్రో ధరల పెంపుపై లోక్‌సభలో గురువారం ప్రతిపక్షాలు ఆందోళన చేపట్టాయి. కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరీ ఇచ్చిన సమాధానంపై నిరసన వ్యక్తం చేస్తూ కాంగ్రెస్, సిపిఎం, వైసిపి, డిఎంకె, టిఎంసి, ఎన్‌సిపి సహా ప్రతి పక్షాలు లోక్‌సభ నుంచి వాకౌట్ చేశాయి. గురువారం లోక్‌సభలో ప్రశ్నోత్తరాల సందర్భంగా పెట్రో ధరలపై కాంగ్రెస్ ఎంపి మురళీధరన్ అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి సమాధానమిస్తూ, ప్రస్తుతం దేశంలో పెట్రోల్ ధర అత్యల్పంగా ఉందని తెలిపారు. అంతర్జాతీయంగా పెట్రోల్ ధరలు 40 శాతం పెరిగితే దేశంలో కేవలం రెండు శాతం మాత్రమే పెరిగాయని తెలిపారు. 1974 తరువాత ఇదే అత్యల్ప పెరుగుదలని చెప్పుకొచ్చారు. గత ఎనిమిదేళ్లలో పెట్రోలు, డీజిల్ ధరలు చాలా తక్కువగా పెరిగాయన్నారు. ఉత్పత్తి వ్యయం, రవాణా ఖర్చు, బీమా ఛార్జీలు, కరెన్సీ మారకం వంటి జాతీయ, అంతర్జాతీయ కారణాల వల్ల పెట్రోల్, డీజిల్ ధరలను నిర్ణయిస్తామని చెప్పారు. దీనికి అదనంగా డీలర్ వాటా లాభం, ఆ తరువాత సెంట్రల్ ఎక్సైజ్ డ్యూటీతో పాటు రాష్ట్ర వ్యాట్ ఉంటుందని వివరించారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరల కారణంగా ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు రూ.27,276 కోట్ల నష్టాన్ని చవిచూశాయని చెప్పారు. ఇదే సమయంలో చాలా రాష్ట్రాలు వ్యాట్‌ను తగ్గించాయని, కానీ బిజెపియేతర రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ, జార్ఖండ్ పెట్రోలియం ఉత్పత్తులపై వ్యాట్‌ను తగ్గించకపోవడంతో ఆయా రాష్ట్రాల్లో పెట్రోలు, డీజిల్ ధరలు ఎక్కువ ఉన్నాయని అన్నారు. కొన్ని రాష్ట్రాలు లీటర్ పెట్రోల్‌పై రూ.17 వ్యాట్‌ను వసూలు చేయగా, కొన్ని రాష్ట్రాలు రూ.32 వసూలు చేస్తున్నాయని పేర్కొన్నారు. వెంటనే కేంద్ర మంత్రి ప్రకటనలపై ప్రతిపక్షాలు భగ్గుమన్నాయి. ప్రతిపక్ష కాంగ్రెస్‌తో పాటు సిపిఎం, వైసిపి, టిఎంసి, డిఎంకె, ఎన్‌సిసి, ఆర్‌ఎస్‌పి, ఎన్‌సిపి, ఎస్‌పి, సిపిఐ, ఐయుఎంఎల్ వంటి పార్టీలు కేంద్ర మంత్రి సమాధానంపై తీవ్ర నిరసన వ్యక్తం చేశాయి. దీనిపై కేంద్రమంత్రి స్పందిస్తూ, 'ప్రతిపక్షాలకు చెందిన ఎంపిలు తమ రాష్ట్ర ప్రభుత్వాలు వ్యాట్‌ని తగ్గించేలా చూడాలని నేను సూచిస్తున్నాను. తద్వారా వారు కూడా వేడుకల్లో పాల్గొనవచ్చు' అని అన్నారు. కేంద్రమంత్రి సమాధానంపై సంతృప్తి చెందని ప్రతిపక్షాలు వాకౌట్ చేశాయి. వైసిపి లోక్‌సభా పక్ష నేత పివి. మిథున్ రెడ్డి, మార్గాని భరత్, లావు శ్రీకృష్ణ దేవరాయలు, బీశెట్టి సత్యవతి, జి.మాధవి తదితరులు మిగతా విపక్ష సభ్యులతో కలిసి వాకౌట్ చేసి సభ నుంచి బయటకు వెళ్లారు.

చైనాను కట్టడి చేయడానికే ఇండో-పసిఫిక్ వ్యూహం

బీజింగ్ : ఇండో-పసిఫిక్ అన్న భావనే లేదని చైనా దౌత్యవేత్త వ్యాఖ్యానించారు. కేవలం చైనాను కట్టడి చేయడానికే భారత్ వంటి భాగస్వాములను తీసుకురావడానికి అమెరికా దీన్ని సృష్టించిందని అన్నారు. ఇండో-పసిఫిక్ వ్యూహం, క్వాడ్ వంటి ప్రాంతీయ గ్రూపుల పట్ల బీజింగ్ వ్యతిరేకత దీంతో స్పష్టమైంది. 'వాస్తవానికి భౌగోళిక రాజకీయాల్లో ఇండో-పసిఫిక్ అనే భావనే లేదు." అని ఫ్రాన్స్‌లో చైనా రాయబారి లూ షాయే ఫ్రెంచి జర్నలిస్టులతో మాట్లాడుతూ వ్యాఖ్యానించారు. పారిస్‌లోని చైనా ఎంబసీ కార్యాలయం బుధవారం ఈ వ్యాఖ్యలను ప్రచురించింది. కేవలం అమెరికా సృష్టించిన భావనే ఇదని విమర్శించారు. గతంలో మనం పసిఫిక్ లేదా ఆసియా-పసిఫిక్ ప్రాంతం గురించి మాట్లాడుకునేవారం. అంతేకానీ ఇండో-పసిఫిక్ గురించి ఎన్నడూ మాట్లాడుకోలేదు. హిందూ మహా సముద్రంలోకి అమెరికన్లను ఎందుకు చేర్చారు? ఎందుకంటే కేవలం ఆసియా-పసిఫిక్ మిత్రపక్షాలు మాత్రమే చైనాను అదుపు చేయడానికి సరిపోవని వారు భావించారు. అందుకే భారత్‌ను, ఫ్రాన్స్ వంటి అమెరికా ఇతర మిత్రపక్షాలను రంగంలోకి తీసుకువచ్చారు. కానీ ఇది తప్పని చైనా రాయబారి విమర్శించారు. ఫ్రాన్స్ తనకు తాను ఇండో-పసిఫిక్ దేశంగా భావిస్తోందని ఇది పొరపాటని అన్నారు. ఇదంతా కూడా ప్రచ్ఛన్న యుద్ధ మనస్తత్వమని, దానికి తాము వ్యతిరేకమని స్పష్టం చేశారు.

ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల సంస్థ నుండి ఇరాన్ తొలగింపు

- తీర్మానంపై ఓటింగ్‌కు భారత్ గైర్హాజరు

న్యూయార్క్ : లింగ సమానత్వాన్ని, మహిళా సాధికారతను పెంపొందించేందుకు ఉద్దేశించిన అంతర్జాతీయ అంతర ప్రభుత్వ సంస్థ నుండి ఇరాన్‌ను తొలగించారు. అంతకుముందు ఇరాన్‌ను తొలగించాలని కోరుతున్న ముసాయిదా తీర్మానంపై ఓటింగ్‌కు భారత్ గైర్హాజరైంది. ఐక్యరాజ్య సమితి ఆర్థిక, సామాజిక మండలి ఈ నెల 14న ఈ ముసాయిదా తీర్మానాన్ని ఆమోదించింది. ఇరాన్‌లో మహిళలు, బాలికలపై అణచివేతను ఉదహరిస్తూ, 2022-2026 పదవీకాలంలో మిగిలిన కాలానికి మహిళా స్థితిగతులపై కమిషన్ నుండి ఇరాన్ సభ్యత్వాన్ని తొలగించాలంటూ అమెరికా ఈ ముసాయిదాను ప్రవేశపెట్టింది. తీర్మానానికి అనుకూలంగా రికార్డు స్థాయిలో 29మంది ఓటు వేశారు. రష్యాతో సహా ఎనిమిది దేశాలు వ్యతిరేకించాయి. కాగా భారత్, బంగ్లాదేశ్‌తో సహా 16దేశాలు గైర్హాజరయ్యాయి. ఈ ఏడాది సెప్టెంబరు నుండి ఇరాన్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల పట్ల ఆర్థిక, సామాజిక మండలి తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. భావ ప్రకటనా స్వేచ్ఛతో సహా మహిళలు, బాలికల మానవ హక్కులను ఇరాన్ కాలరాస్తోందని మండలి పేర్కొంది. తక్షణమే అమల్లోకి వచ్చేలా ఇరాన్‌ను తొలగించాలని తీర్మానించింది. సెప్టెంబరు 16న ఇరాన్ మొరాలిటీ పోలీసుల నిర్బంధంలో 22ఏళ్ళ మషా అమిని అనే యువతి మరణించినప్పటి నుండి ఇరాన్‌లో తీవ్రంగా నిరసనలు పెల్లుబుకుతున్నాయి. వాటిపై ఇరాన్ ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోంది.

యుఎన్ చీఫ్ గుటెరస్‌తో జై శంకర్ చర్చలు

- జి-20 అధ్యక్ష బాధ్యతలపై అభిప్రాయాలు మార్పిడి



న్యూయార్క్ : డిసెంబరు 1వ తేదీన జి-20 అధ్యక్ష బాధ్యతలను భారత్ అధికారికంగా స్వీకరించింది. ఈ నేపథ్యంలో భారత విదేశాంగ మంత్రి జై శంకర్ ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటానియో గుటెరస్‌తో భేటీ అయ్యారు. భారత్ జి-20 అధ్యక్ష బాధ్యతల సమయంలో కలిసి పనిచేయడంపై ఇరువురు అభిప్రాయాలు పంచుకున్నారు. ఐక్యరాజ్య సమితి భద్రతా మండలికి ప్రస్తుతం భారత్ నేతృత్వం వహిస్తుందన్న తీవ్రవాదంపై పోరాటం, సంస్కరించబడిన బహుళపక్షవాదం అనే అంశాలపై నిర్వహించే రెండు కార్యక్రమాలకు అధ్యక్షత వహించడానికి జై శంకర్ మంగళవారం ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా గుటెరస్‌తో సుహృద్భావ సమావేశం జరిగిందని, భద్రతా మండలి సంస్కరణలపై, ఉక్రెయిన్ ఘర్షణపై ఆయన అభిప్రాయాలు తెలుసుకున్నామని, ఇరు పక్షాలు కలిసి పనిచేయడంపై మాట్లాడుకున్నామని జై శంకర్ ట్వీట్ చేశారు. 'అంతర్జాతీయ శాంతి భద్రతల నిర్వహణ : సంస్కరించబడిన బహుళపక్షవాదం కోసం నూతన దృక్పథం' అనే అంశంపై భద్రతా మండలిలో బుధవారం బహిరంగ చర్చ జరిగింది. ఆ సమావేశంలో గుటెరస్ మాట్లాడారు. ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యాలయంలో నార్త్ లాన్స్‌లో ఏర్పాటు చేసిన మహాత్మా గాంధీ విగ్రహాన్ని అంతకుముందు జై శంకర్, గుటెరస్, జనరల్ అసెంబ్లీ అధ్యక్షుడు కాసబా కొరొసిలు ఆవిష్కరించారు. కౌన్సిల్‌లో చర్చ సందర్భంగా జై శంకర్ పలు ద్వైపాక్షిక సమావేశాలు కూడా నిర్వహించారు. ఆర్మేనియా, యుఎఇ, పోలాండ్ ప్రతినిధులతో భేటీ అయి భద్రతా మండలి సంస్కరణలపై చర్చించారు.

బడ్జెట్ ముసాయిదాను ప్రవేశపెట్టిన వెనిజులా ఉపాధ్యక్షురాలు

కారకస్ : వెనిజులా ప్రభుత్వం 11565 మిలియన్ డాలర్లతో 2023 బడ్జెట్ ముసాయిదాను ప్రవేశపెట్టింది. వెనిజులా ఉపాధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ జాతీయ అసెంబ్లీలో ఈ ముసాయిదాను సమర్పించారు. ఈ బడ్జెట్ 2023లో ఆర్థిక వ్యవస్థలో నూతన ఉత్సాహాన్ని నింపేందుకు దోహదపడుతుందని అన్నారు. బడ్జెట్‌లో 77.1 శాతాన్ని సామాజిక పెట్టుబడి కోసం, సామాజిక కార్యక్రమాల అవసరమైన నిధుల కోసం వినియోగించనున్నట్లు పేర్కొన్నారు. జాతీయ ఉత్పత్తిని ప్రోత్సహించడం ప్రధాన లక్ష్యమని, కమ్యూనల్ కౌన్సిల్స్, వ్యవస్థలు, ఇతర ఏజెంట్ల ఉత్పత్తులను ప్రజాసేకరణ విధానాల ద్వారా సేకరిస్తామని అన్నారు.

దేశంలో 28,46,43,842 మంది అసంఘటిత రంగ కార్మికులు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలో 28,46,43,842 మంది అసంఘటిత రంగ కార్మికులు ఉన్నారని కేంద్ర కార్మిక శాఖ సహాయ మంత్రి రామేశ్వర్ తేలి తెలిపారు. రాజ్యసభలో ఒక ప్రశ్నకు ఆయన సమాధానం ఇచ్చారు. డిసెంబర్ 11 వరకు ఈ శ్రమ పోర్టల్‌లో నమోదు చేసుకున్న అసంఘటిత రంగ కార్మికులు 31 రంగాలకు చెందిన 28,46,43,842 మంది ఉన్నారని తెలిపారు.

రూ.581 నుంచి రూ.1,053కి పెరిగిన గ్యాస్ ధర

దేశంలో రెండున్నరేళ్లలో వంట గ్యాస్ ధర దాదాపు రూ.500 వరకు పెరిగింది. ఈ మేరకు లోక్‌సభలో ఒకప్రశ్నకు కేంద్ర పెట్రోలియం శాఖ సహాయ మంత్రి రామేశ్వర్ తేలి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 2020 మే 1 నాటికి దేశంలో వంట గ్యాస్ ధర రూ.581 ఉండగా, అది 2022 డిసెంబర్ 1 నాటికి రూ.1,053కి పెరిగింది.

ప్రభుత్వ రంగం బీమా కంపెనీల్లో ఐదేళ్లలో 20 శాతం ఉద్యోగాలు తగ్గుదల

గత ఐదేళ్లలో ప్రభుత్వ రంగ బీమా కంపెనీ (పిఎస్ఐసి)ల్లో ఉద్యోగుల సంఖ్య 20 శాతం తగ్గిందని కేంద్ర ఆర్థిక మంత్రి భగవత్ కరాద్ తెలిపారు. సిపిఎం ఎంపి ఎఎ రహీం అడిగిన ప్రశ్నకు ఆయన లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 2018 మార్చి 31 నాటికి ఏడు బీమా కంపెనీల్లో 1,73,797 మంది ఉద్యోగులు ఉంటే, 2022 మార్చి 31 నాటికి 1,48,266 మంది ఉద్యోగులకు పడిపోయిందని తెలిపారు. ఈ కాలంలో 34,531 మంది ఉద్యోగులు తగ్గారు.

ఎపిలో 3,985 పరిహారం కేసులు పెండింగ్

ఆంధ్రప్రదేశ్‌లో జాతీయ రహదారుల కోసం భూ సేకరణ చేసిన వారికి పరిహారానికి సంబంధించిన 3,985 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. లోక్‌సభలో ఒకప్రశ్నకు ఆయన లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. తెలంగాణలో 2,781 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు.

పాకిస్థాన్ వ్యాఖ్యలను తిప్పికొట్టిన భారత్

వాషింగ్టన్ : ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో కాశ్మీర్ అంశాన్ని లేవనెత్తిన పాకిస్థాన్‌పై భారత్ ధీటుగా స్పందించింది. ఒసామా బిన్‌లాడెన్ లాంటి ఉగ్రవాదికి ఆశ్రయం కల్పించిన దేశానికి, పొరుగు దేశం పార్లమెంటుపై దాడికి పాల్పడిన వారికి ఐరాస ప్రపంచవేదికపై నీతులు చెప్పే అర్హత లేదని పేర్కొంది. ఐరాస భద్రతా మండలి చర్చా కార్యక్రమంలో పాకిస్థాన్ విదేశాంగ మంత్రి బిలావల్ భుట్టో కాశ్మీర్ అంశాన్ని లేవనెత్తగా, భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ ధీటుగా స్పందించారు. మహమ్మారి, పర్యావరణ మార్పు, వివాదాలు లేదా ఉగ్రవాదం వంటి కీలక సవాళ్లపై సమర్థవంతంగా స్పందిస్తేనే విశ్వసనీయత ఆధారపడి ఉంటుందన్నారు. బహుళ పాక్షిక సంస్కరణలపై చర్చించేందుకు జైశంకర్ మంగళవారం ఐక్యరాజ్యసమితి కార్యాలయానికి చేరుకున్న సంగతి తెలిసిందే. బహుళ పాక్షికత ఆవశ్యకతపై దృష్టిపెడుతున్నామని, దీనిపై భారత్ ప్రత్యేక అభిప్రాయాలను కలిగి ఉందని అన్నారు. సమస్యలపై ఉత్తమ పరిష్కారం కోసం శోధిస్తున్నప్పుడు ఇటువంటి ముప్పులను సాధారణంగా తీసుకోకూడదని, ప్రపంచం మొత్తం ఆమోదించదని .. వాటిని సమర్థించాలనే ప్రశ్న తలెత్తకూడదని అన్నారు. సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న దేశాలకు ఇది వర్తిస్తుందని అన్నారు. పొరుగుదేశ పార్లమెంటుపై దాడి చేసిన దేశానికి ఇతరులకు బోధించే అర్హత లేదని అన్నారు. కాశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు భారత్ అంతర్గత వ్యవహారమని అన్నారు. పాకిస్థాన్ అసత్య ప్రచారాలను ఇకనైనా ఆపాలని సూచించారు. ఉగ్రవాదం, శతృత్వం, హింసకు తావులేని వాతావరణంలో మాత్రమే పాక్‌తో సంబంధాలను భారత్ కోరుకుంటుందని చెప్పారు.



మీకోసం

ఎండు ఖర్జూరాలను రాత్రి నీటిలో నానబెట్టి, ఉదయం ఆ నీటిని తాగితే ఒంట్లో వేడి తగ్గుతుంది.

జీవన సౌరభం

నిరంతరం శ్రమించేవాణ్ని చూసి ఓటమి భయపడుతుంది.

JEEVANA జీవన the family

చిచ్చర పిడుగులం

తెలుగు అక్షరాలను అల్లేస్తాం
ఏ బీ సీ డీ లను ఎక్కేస్తాం
పదాలు పదాలను పలికేస్తాం
పుస్తకాల్లోని పాఠాలను వల్లేవేస్తాం
పరీక్షలు రాసి ఫలితాలు సాధిస్తాం!


ఆటలతో అడుగులు కలిపేస్తాం
దెబ్బలు తగిలినా ధైర్యం చేస్తాం
ఏ ఆటలోనైనా గెలిచి చూపిస్తాం
ప్రత్యర్థి జట్టును మట్టి కరిపిస్తాం
విజయ కేతనం ఎగరవేస్తాం !

సత్యమనే సాగరాన్ని ఈదేస్తాం
ప్రేమనే పుడమిపై పులకరిస్తాం
మర్యాదనే మణిహారాన్ని ధరిస్తాం
జ్ఞానమనే గనిలో గంతులేస్తాం
వినయమనే విశ్వంలో విహరిస్తాం !



వివేకానందలా ఖ్యాతిగడిస్తాం
అహింసా మార్గంలో నడుస్తాం
ఉక్కు మనిషిలా పిడికిలి బిగిస్తాం
మహానీయుల మధ్యలో నిలుస్తాం
కన్నవారిని నిత్యం కొలుస్తాం !

- బోనగిరి పాండురంగ
తొర్రూరు




ఖాళీలు పూరించండి

పిల్లలూ, ఇక్కడ కొన్ని బొమ్మలు, వాటి పక్కనే వాటి పేర్లూ ఉన్నాయి. అయితే, స్పెల్లింగ్‌లో కొన్ని అక్షరాలు లేవు. వాటిని నింపండి.

నేను గీసిన బొమ్మ




ఉల్లెంగల తేజస్విని
6వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ,
భూంపల్లి, సిద్దిపేట జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

వద్దే వద్దు ఈ పెళ్లి ...




'నా ఈడు పిల్లలందరూ ఆడుకుంటుంటే నేనేమో ఇద్దరు బిడ్డల తల్లినయ్యాను. స్కూలుకెళ్లే వయసులో పెళ్లి చేసేసి కొండంత భారం దించుకున్నాననుకున్నారు మా అమ్మానాన్న.. భర్త, సంసారం అంటే ఏమిటో తెలియని వయసులోనే కుటుంబ భారాన్ని మోసాను. ఇప్పుడు నా బిడ్డకు నా పెళ్లి వయసు వచ్చింది. ఇప్పుడు నా కళ్ల ముందే బిడ్డ పెళ్లి గురించి మాట్లాడుతున్నారు. విన్నప్పుడు నా కాళ్ల కింద భూమి కంపించినట్టు ఉంటోంది. నేను పడ్డ క్షోభ నా బంగారుతల్లికి రానీయను' అంటూ ఆక్రోశిస్తోంది ఆమె. ఇప్పటికీ సమాజాన్ని పట్టి పీడిస్తున్న అతి పెద్ద రుగ్మత బాల్య వివాహాలు. అలా బలైన ఓ అమ్మాయి ఆవేదన ఇది.

నా పేరు శ్రీవల్లి (22) (పేరు మార్చాం). నాన్న లేరు. అమ్మ, అమ్మమ్మ పెంచారు. బాగా చదువుకోవాలని, పోలీసు ఉద్యోగం చేయాలని కలలుగన్నాను. స్కూల్లో చాలా చురుకుగా ఉండేదాన్ని. బాలికల చదువు, బాల్య వివాహాలు అరికట్టడం వంటి సదస్సులకు స్కూలు స్థాయిలోనే నాయకత్వ హోదాలో హాజరయ్యేదాన్ని. కాని పదో తరగతి కూడా పాసవ్వకముందే అమ్మమ్మ నా పెళ్లి చేయాలని నిశ్చయించింది. వద్దని వారించినా బలవంతం చేసింది. పెళ్లి చేసుకోకపోతే చచ్చిపోతానని బెదిరించింది. చేసేదేమీ లేక ఒప్పుకున్నాను. 14 ఏళ్ల వయసులో నా కంటే 15 ఏళ్లు పెద్దవాడితో పెళ్లిచేశారు. పెళ్లయిన ఏడాదికే పాప పుట్టింది. అప్పటి నుంచి నన్ను వేధించడం మొదలుపెట్టాడు. 'ఆడపిల్ల పుట్టింది. దీన్ని ఎవరికి కన్నావు?' అంటూ అవమానకరంగా మాట్లాడేవాడు. విచక్షణా రహితంగా కొట్టేవాడు. దెబ్బలు తాళలేక ఒళ్లంతా కమిలిపోయేది. రెండోసారి ఆడపిల్ల పుట్టింది. వేధింపులు మరింత పెరిగాయి. అతను కొట్టిన దెబ్బలకు కిడ్నీ పాడయ్యింది. గుండె సంబంధిత సమస్యలు వచ్చాయి. బతుకుతానో లేదో అనుకున్నారు. 18 ఏళ్లకే షుగర్, బీపీ బాధలు మొదలయ్యాయి. ఇప్పుడు 'నువ్వు నాకక్కర్లేదు' అంటూ నడిరోడ్డు మీద వదిలేసి పోయాడు. అనారోగ్యంతో శరీరం నిండా గాయాలతో సత్తువ లేకుండా బతుకుతున్నాను. నా పరిస్థితి మరే ఆడపిల్లకు రాకూడదు.. ఓ పెద్దలారా.. ఇకనైనా మేల్కొనండి. ఆడపిల్ల భవిష్యత్తు పెళ్లి, పిల్లలు కాదు..' అంటూ కన్నీటిపర్యంతమవుతోంది శ్రీవల్లి. తను చిత్తూరు జిల్లా వాసి.

నా బాధకు బాధ్యులెవరు?

నా పేరు రమ్య (21) (పేరు మార్చాం). మాది పేద కుటుంబం. నేను, తమ్ముడు గవర్నమెంటు స్కూల్లోనే చదువుకున్నాం. పదో తరగతి ఫస్టు క్లాసులో పాసయ్యాను. నర్సు ట్రైనింగ్ తీసుకోవాలనుకున్నాను. కాని నాన్న ఇంతటితో చదువు ఆపేయమన్నారు. బంధువుల అబ్బాయితో పెళ్లి నిశ్చయించారు. అప్పుడు నా వయస్సు 15. పెళ్లయిన ఏడాదికి పాప పుట్టింది. ప్రసవం కష్టమైంది. అనారోగ్య సమస్యలతో సతమతమవుతూనే రెండో బిడ్డను ప్రసవించాను. ఈసారి బిడ్డ అనారోగ్యంతో పుట్టాడు. శారీరక, మానసిక ఎదుగుదల లేని ఆ బిడ్డ వైద్య చికిత్సల భారం మేం భరించలేం. ఇంత బాధలో ఉండగానే నేను మూడో బిడ్డను కనవలసి వచ్చింది. ఈ బిడ్డ పురిట్లోనే చనిపోయాడు. 20 ఏళ్లు నిండకుండానే ముగ్గురు బిడ్డల తల్లినయ్యాను. నాకు ఈ పరిస్థితి ఎందుకు వచ్చింది? బాల్యంలోనే పెళ్లి, పిల్లల భారం మాపై మోపకండి. మా కాళ్ల మీద మేము నిలబడే ఆత్మస్థైర్యం మాకు ఇవ్వండి. విద్య ద్వారానే అది సాధ్యమవుతుంది. బడి ఈడులో పెళ్లి చేయడం ఇకనైనా ఆపండి' అంటూ బిగ్గరగా అరిచి చెబుతున్న రమ్య మచిలీపట్నం నివాసి.

బాల్య వివాహాలు-నివారణ చర్యలు అనే అంశంపై చైల్డ్ రైట్స్ అండ్ యు (క్రై) ఆధ్వర్యంలో ఇటీవల విజయవాడలో జరిగిన అవగాహన సదస్సుకు హాజరైన బాల్య వివాహ బాధితుల దీనగాథలు ఇవి.



బాల్య వివాహాలు - రాష్ట్రం

2019- 21 జాతీయ కుటుంబ ఆరోగ్య నివేదిక గణాంకాల ప్రకారం 18 ఏళ్లకంటే ముందుగా వివాహమవుతున్న వారి శాతం దక్షిణాది రాష్ట్రాల్లో పరిశీలించినప్పుడు మన రాష్ట్రం 29.3 శాతంతో అగ్రభాగంలో ఉంది. ఇది దేశ సగటు కంటే అధికమని సర్వే తేల్చింది.

18 ఏళ్ల కంటే ముందుగా వివాహమవుతున్న బాలికల శాతాల్లో మొదటి ఐదు జిల్లాలుగా అనంతపురం (37.3), ప్రకాశం (37.3), కర్నూలు (36.9), గుంటూరు (35.4), విజయనగరం (33.7) ఉన్నాయి. అత్యల్పశాతం నమోదైన పశ్చిమ గోదావరి (22.1)కి అనంతపురానికి మధ్య వైవిధ్యం పరిశీలించినప్పుడు బాల్య వివాహాల అరికట్టడంలో ప్రభుత్వాలు తీసుకోవాల్సిన సత్వర చర్యల ఆవశ్యకతను తెలియజేస్తోంది.

ఏం చెబుతున్నారంటే..

ఈ సమస్య పోవాలంటే పిల్లలందరికీ ప్రత్యేకించి బాలికలకు సురక్షితమైన, ఆరోగ్యకరమైన బాల్యాన్ని అందించేందుకు వ్యవస్థలు, సంఘాల మధ్య అంతరం తొలగాలి. బాల్య వివాహాలు జరగడం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించడంతో పాటు ఈ నేరానికి పాల్పడితే వేసే శిక్షలను జనబాహుళ్యంలోకి తీసుకురావాలి. ఆ దిశగా ప్రభుత్వం కీలకపాత్ర పోషించాలని 'క్రై' సూచిస్తోంది.

కోవిడ్ తరువాత జరిగిన అతి పెద్ద మార్పుల్లో బాల్యవివాహాలు అధికమవ్వడమని కేంద్ర ప్రభుత్వ అనుబంధ సంస్థ 'చైల్డ్ కేర్' ధృవీకరిస్తోంది. పేదరికం, అవిద్య, నిరక్షరాస్య కుటుంబాల్లోనే కాక కుటుంబ గౌరవం, పరువు దృష్ట్యా కోవిడ్ తరువాత కాలంలో యుక్త వయసు రాకముందే ఆడపిల్లలకు పెళ్లిళ్లు చేయడం ఎక్కువైందని ఆ సంస్థ స్పష్టం చేస్తోంది.

బాధ్యత అందరిదీ..

ప్రభుత్వ యంత్రాంగం జోక్యంతోనో.. ఏదేని స్వచ్ఛంద సంస్థ చొరవతోనో ఎన్నో బాల్య వివాహాలను ఆ క్షణంలో నిరోధించడానికి వీలౌతోందని సర్వేలు చెబుతున్నాయి. అయితే ఆ తరువాత కొన్ని రోజులకు ఆ పెళ్లిళ్లు యథావిధిగా జరుగుతున్నాయన్నది వాస్తవం. పై రెండు ఉదాహరణల్లో ఆ ఇద్దరి ఆడపిల్లల పెళ్లిళ్లు అలాగే జరిగాయి. అందుకే సమాజం యావత్తు ఈ సమస్యపై దృష్టి పెట్టాలి. బాల్యవివాహాలు అరికట్టడంలో తమవంతు బాధ్యత వహించాలి. బాల్య వివాహాల నిషేధం సామాజిక బాధ్యతగా తీసుకోవాలి.

- జ్యోతిర్మయి

రంగవల్లులకు స్వాగతం!

సంక్రాంతి పండుగ హడావిడిలో ముగ్గులది ప్రత్యేక స్థానం. మరి ఇంకెందుకు ఆలస్యం? చకచకా ముగ్గులు వేసేయండి. 'జీవన' పాఠకులతో పంచుకోండి. తెల్ల కాగితంపై పెన్సిల్ లేదా బాల్‌పాయింట్ పెన్నుతో వేసిన ముగ్గులకు రంగులు నింపి పంపండి. అందరికీ అర్థమయ్యేలా నిలువు, అడ్డం చుక్కల వివరాలు కూడా పేర్కొనండి. మీ పేరు, చిరునామా, ఫొటో, ఫోన్ నెంబరు కచ్చితంగా పంపాలి. మెయిల్ ద్వారా పంపేవారు పూర్తి చిరునామా పంపాలి.

మా చిరునామా

రంగవల్లి
ప్రజాశక్తి దినపత్రిక
ప్రజాశక్తి భవనం
అరవింద హై స్కూలు దగ్గర,
అమరారెడ్డి కాలనీ,
తాడేపల్లి - 522501, గుంటూరు జిల్లా.
మెయిల్ ఐడి :
jeevanapageps@gmail.com
వాట్సాప్ : 83329 25496

సచివాలయాల్లో 'ప్రత్యేక' తనిఖీలు

- ఉద్యోగుల పనితీరుపై స్పెషల్ సిఎస్ శ్రీలక్ష్మి ఆరా
- కలకలం రేపుతున్న ప్రజాశక్తి కథనం



సచివాలయ ఉద్యోగులతో మాట్లాడుతున్న శ్రీలక్ష్మి


ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గ్రామ, వార్డు సచివాలయాల పనితీరు, ప్రజలకందిస్తున్న సేవలు ? ఉద్యోగుల పనితీరు, అటెండెన్స్ ఎలా ఉందనే అంశాలపై మునిసిపల్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మి విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఇప్పటికే 'చిరు ఉద్యోగులపై సర్కారు దాడి' అనే శీర్షికన గురువారం ప్రజాశక్తిలో ప్రచురితమైన కథనం నేపథ్యంలో స్పెషల్ సిఎస్ గురువారం గుంటూరు జిల్లా తాడేపల్లి పద్మశాలీయ నగర్ మార్కెట్ సెంటర్‌లోని 13వ నెంబరు సచివాలయం, ఉండవల్లి సెంటర్‌లోని 14వ సచివాలయాలను ఆకస్మిక తనిఖీలు చేయడం చర్చనీయాంశం అయింది. సిబ్బంది ఉద్యోగుల రికార్డులు, హాజరు, సమయపాలన, అటెండెన్స్ వివరాలను పరిశీలించారు. ఉద్యోగుల హాజరుకు సంబందించి సిబ్బందిని ప్రశ్నించారు. ఉద్యోగులందరూ ప్రభుత్వ నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. ఉద్యోగులు విధులు ఎలా నిర్వర్తిస్తున్నారనే అంశాలపై వార్డు సెక్రటరీలకు పలు సూచనలు చేశారు. స్పెషల్ సిఎస్ ఆకస్మిక తనిఖీలు చేపట్టడంతో విజయవాడ, గుంటూరు జిల్లాల్లోని గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ఏ సమయంలో ఏ అధికారి తనిఖీలు చేపడతారోననే ఆందోళనకు గురయ్యారు. ఒక వైపు ఉన్నతాధికారుల ఆకస్మిక తనిఖీలు కొనసాగుతుండగా మరో వైపు మండల స్థాయిల్లో ఇఒపిఆర్‌డిలు వాట్సాప్ మెసేజ్‌ల ద్వారా విఆర్‌ఓ, గ్రామ సర్వేయర్లు సచివాలయంలో బయోమెట్రిక్ వేయడంతోపాటు అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకం చేయాలని, సచివాలయ సిబ్బంది బయటకు వెళ్లే సమయంలో మూవ్‌మెంట్ రిజిస్టర్‌లో నమోదు చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

విఆర్‌ఓలపై పనిభారం పెరిగిందని, పని ఒత్తిడితో అనేకమంది మరణించారని విఆర్‌ఓ సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ తీరుపై త్వరలో సమావేశం ఏర్పాటు చేసుకుని భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని చెబుతున్నారు.

ఫైనల్లోకి ఫ్రాన్స్

- వరుసగా రెండోసారి
- టైటిల్‌కై 18న అర్జెంటీనాతో ఢీ
- ఫిఫా ప్రపంచకప్



దోహా: ఫిఫా ప్రపంచకప్-2022 ఫైనల్లోకి డిఫెండింగ్ ఛాంపియన్ ఫ్రాన్స్ జట్టు వరుసగా రెండోసారి దూసుకెళ్లింది. 2018లో టైటిల్ నెగ్గిన ఫ్రాన్స్ జట్టు బుధవారం జరిగిన రెండో సెమీస్‌లో సంచలన విజయాల మొరాకో జట్టుపై 2-0గోల్స్ తేడాతో విజయం సాధించింది. మ్యాచ్ ప్రారంభమైన 5వ ని.లోనే హేమండెజ్ అద్భుత గోల్ కొట్టడంతో ఆ జట్టు 1-0 ఆధిక్యతలోకి దూసుకెళ్లింది. ఆ తర్వాత మొరాకో జట్టుకు పలుసార్లు గోల్ చేసే అవకాశం లభించినా ప్రయోజనం లేకపోయింది. రెండుసార్లు బంతి గోల్ బార్‌కు తగిలి దూరంగా వెళ్లాయి. రెండో గోల్‌ను ఫ్రాన్స్ జట్టు తరపున కోలో మౌని(79వ ని.)లో చేశాడు. ఆల్ బై స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో మొరాకోజట్టు డిఫెండింగ్ ఛాంపియన్ ఫ్రాన్స్‌కు గట్టి పోటీనిచ్చింది. ఫిఫా ప్రపంచకప్ ఫైనల్ ఆదివారం(18న) జరగనుండగా.. 3వ స్థానానికై సెమీస్‌లో ఓడిన క్రొయేషియా-మొరాకో జట్లు శనివారం తలపడనున్నాయి. ఫ్రాన్స్, అర్జెంటీనా జట్లు రెండేసి సార్లు ఫిఫా ప్రపంచకప్ టైటిల్‌ను గెలిచాయి.

గోల్డెన్ బూట్ రేసులో మెస్సీ, ఎంబపే



గోల్డెన్ బూట్ రేసులో మెస్సీ, మాపే

ఇక గోల్డెన్ బూట్ రేసులో అర్జెంటీనా కెప్టెన్ మెస్సీతోపాటు ఫ్రాన్స్ సంచలనం ఎంబపే నిలిచాడు. వీరిద్దరూ ఈ టోర్నమెంట్‌లో ఐదేసి గోల్స్ కొట్టి వీరిద్దరూఅగ్రస్థానంలో ఉన్నారు. ఈ టోర్నమెంట్‌లో మెస్సీ మైదానంలోకి దిగిన 114ని.లకు ఒక్కో గోల్ చొప్పున కొట్టగా.. పెంబపే 95ని.లకు చొప్పున ఒక్కో గోల్ కొట్టాడు. జులియన్ అల్వెరెజ్ (అర్జెంటీనా-4గోల్స్), ఒలివియర్ గిరౌడ్(ఫ్రాన్స్-4గోల్స్) ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నారు.

రాజు.. మృత్యుంజయుడు

బండరాళ్ల మధ్య 47 గంటలు నరకయాతన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు బండరాళ్ల మధ్యలో చిక్కుకుని 47 గంటలపాటు నరకయాతన అనుభవించిన షాడ రాజు క్షేమంగా బయటపడ్డారు. రాజు కోసం 24 గంటలపాటు రెస్క్యూ ఆపరేషన్ కొనసాగింది. వివరాల్లోకి వెళ్తే.. కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలం రెడ్డిపేట గ్రామానికి చెందిన షాడ రాజు, మిత్రులతో కలిసి మంగళవారం అడవిలో వేటకు వెళ్లారు. అదేరోజు మధ్యాహ్నం మూడు గంటల సమయంలో కన్నాపూర్ శివారులోని పులిగుట్ట గుహలోకి వెళ్లి, తిరిగి వస్తున్న సమయంలో అతని సెల్‌ఫోన్ కిందపడి బండరాళ్ల మధ్యకు చేరింది. దాన్ని బయటకు తీసే క్రమంలో రాజు తలకిందులుగా బండరాళ్ల మధ్యలో చిక్కుకున్నారు. ఆయనను బయటకు తీసేందుకు చేసిన ప్రయత్నాలు విఫలంకావడంతో రాజు మిత్రులు పోలీసులకు సమాచారమిచ్చారు. బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు పోలీసులు, ఫైర్, అటవీ అధికారులు, వైద్యులు బృందంగా ఏర్పడి రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించారు. పైపుల సహాయంతో రాజుకు మంచినీళ్లు, పండ్ల రసాలు అందిస్తూ ధైర్యం చెప్పారు. ప్రొక్లేనర్‌తో మట్టి, బండరాళ్లను తొలగించారు.



రాజును ఆసుపత్రికి తరలిస్తున్న వైద్య సిబ్బంది

గురువారం మధ్యాహ్నం రెండు గంటలకు రాజును క్షేమంగా బయటకు తీశారు. రాజును పరీక్షించిన వైద్యులు జ్వరంతో బాధపడుతున్నట్లు గుర్తించి కామారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సంఘటనా స్థలంలో సహాయక చర్యలను జిల్లా ఎస్‌పి శ్రీనివాసరెడ్డి ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. సహాయక చర్యల్లో ఎఎస్‌పి అన్యోన్య, డిఎస్‌పి సోమనాథం, అధికారులు పాల్గొన్నారు.

తైవాన్‌లో భారీ భూకంపం

తైపీ సిటీ : తైవాన్ తూర్పు తీర ప్రాంతంలో గురువారం 6.2 తీవ్రతతో భారీ భూకంపం సంభవించింది. పలు భవనాలు స్వల్పంగా ధ్వంసమయ్యాయి. వాటికి సమీపంలోని కార్లు, ఇతర వాహనాలు దెబ్బతిన్నాయి. అంతకుమించి ప్రాణ నష్టం కానీ, భారీ ఆస్థి నష్టం సంభవించలేదని ఆ దేశ వాతావరణ శాఖ తెలిపింది. దీంతో తైవానీలు ఊపిరి పీల్చు కున్నారు. తూర్పు తీర ప్రాంతంలోని హువాలియన్ పట్టణానికి ఆగ్నేయంగా 29 కిలో మీటర్ల దూరంలో, 5.7 కిలోమీటర్ల లోతున కేంద్రంగా ఈ భూకంపం సంభవించింది. దీని ప్రభావంతో రాజధాని తైపీలోనూ భవనాలు ఒక నిమిషం పాటు కంపించాయి. ప్రజలు భయంతో రోడ్లపైకి పరుగులు తీశారు. కొన్ని గంటల పాటు అన్ని కార్యకలాపాలు నిలిచిపోయాయి. రెండు టెక్టోనిక్ ప్లేట్ల జంక్షన్ సమీపంలో తైవాన్ ఉంది. దీంతో ఇక్కడ తరుచూ భూకంపాలు సంభవిస్తూ ఉంటాయి. 2016లో తైవాన్‌లో వచ్చిన భూకం పానికి 100 మందికి పైగా మరణించారు. 1999లో వచ్చిన భూకంపానికి 2 వేలకు పైగా ప్రజలు మృతి చెందారు.

సిరాజ్ దెబ్బకు బంగ్లా విల విల

132 పరుగులకే 8 వికెట్లు పతనం



చిట్టగాంగ్: తొలిటెస్ట్‌లో భారతజట్టు పట్టు బిగిస్తోంది. ఓవర్ నైట్ స్కోర్ 6 వికెట్ల నష్టానికి 278పరుగులతో రెండోరోజు ఆటను కొనసాగించిన టీమిండియాను లోయర్ ఆర్డర్ బ్యాటర్ అశ్విన్(58), కుల్దీప్ యాదవ్(40) ఆదుకున్నారు. వీరిద్దరూ కలిసి 8వ వికెట్‌కు 92పరురగులు జతచేశారు. శ్రేయస్(86) ఇబాదత్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. దీంతో టీమిండియా జట్టు ఇన్నింగ్స్ 133.5ఓవర్లలో 404పరుగుల వద్ద ముగిసింది. తైజుల్, మెహిదీ హసన్‌కు నాలుగేసి వికెట్లు దక్కాయి. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన బంగ్లాదేశ్‌కు ఓపెనర్ నజ్ముల్(0), జాకిర్(4) నిరాశపరచడంతో 5పరుగులకే రెండు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ముష్ఫికర్(28), లింటన్ దాస్(24), జాకిర్(20) టాప్ స్కోరర్. సిరాజ్ (3/14), కుల్దీప్(4/33) రాణించడంతో బంగ్లాదేశ్ జట్టు గురువారం ఆట నిలిచే సమయానికి 8 వికెట్లు కోల్పోయి 133పరుగులు చేసింది.



తుదిపోరుకు పుణేరి, జైపూర్

ప్రొ కబడ్డీ సీజన్-9

ముంబయి: ప్రొ కబడ్డీ సీజన్-9 ఫైనల్లోకి పుణేరి పల్టన్స్, జైపూర్ పింక్ ప్యాంథర్స్ జట్లు ప్రవేశించాయి. సర్దార్ వల్లభాయ్ పటేల్ ఇండోర్ స్టేడియం గురువారం జరిగిన సెమీస్ పోటీల్లో జైపూర్ జట్టు 49-29పాయింట్ల తేడాతో బెంగళూరు బుల్స్‌ను, ఉత్కంఠపోటీలో పుణేరి జట్టు 39-37పాయింట్ల తేడాతో తమిళ్ తలైవాస్‌ను ఓడించాయి. జైపూర్ రైడర్ అజిత్(13పాయింట్లు)కి తోడు ట్యాకిల్స్‌లో షాల్ కుమార్(10) సత్తా చాటాడు. ఇక జైపూర్ జట్టు ఆరుసార్లు బెంగళూరు బుల్స్ జట్టును ఆలౌట్ చేసింది. అలాగే పుణేరి జట్టులో పంకజ్ మోహిత్ (16)రైడ్ పాయింట్లు సాధించగా.. ఇస్మాయిల్(6) ట్యాకిల్స్‌లో మెరిసాడు. తమిళనాడు జట్టులో నరేందర్(12)మాత్రమే రైడ్స్‌లో రాణించాడు. .పుణేరి జట్టు నాలుగు సార్లు, తమిళ్ జట్టు రెండుసార్లు ప్రత్యర్థి జట్లను ఆలౌట్ చేశాయి. శనివారం టైటిల్ పోరుకై పుణేరి-జైపూర్ జట్లు పోటీపడనున్నాయి.

ఆంధ్రకు తప్పని ఓటమి

ముంబయి చేతిలో తొమ్మిది వికెట్ల తేడాతో పరాభవం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రంజీ ట్రోఫీ ఎలైట్ గ్రూప్-బిలో ఆంధ్రప్రదేశ్ జట్టు తొలి మ్యాచ్‌లో ఓటమిపాలైంది. విజయనగరంలోని చింతలవలస పివిజి రాజు క్రికెట్ మైదానంలో జరుగుతున్న రంజీ మ్యాచ్‌లో ఆంధ్రజట్టు 9వికెట్ల తేడాతో ముంబయి చేతిలో ఓడింది. ఆంధ్ర జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 238 పరుగులు చేయగా ముంబయి జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 331 పరుగులు చేసి ఆలౌట్ అయ్యింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో ఆంధ్ర జట్టు 131 పరుగులకు ఆలౌట్ అయ్యింది. దీంతో 40 పరుగులు లక్ష్యాన్ని ముంబయి జట్టు రెండో 6.1 ఓవర్లలో ఒక వికెట్ కోల్పోయి ఛేదించి విజేతగా నిలిచింది. బ్యాటింగ్‌లో, బౌలింగ్‌లో రాణించిన తనుష్ కొటియా మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా ఎంపికయ్యారు. ఈ విజయంతో ముంబయి జట్టు ఆరు పాయింట్లు సాధించింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68